స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 141 | శుక్రవారం, అక్టోబర్ 9, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 12 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 141 | FRIDAY, OCTOBAR 9, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 12 | RS : 5-00 |


**వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రారంభానికి రాష్ట్రం సిద్ధం**

చిన్న, సన్నకారు రైతులకు

ప్రయోజనం చేకూరేలా పథకం

సబ్సిడీ నేరుగా రైతుల

ఖాతాల్లో జమ: మంత్రి

తుమ్మల

2 లో..

# 13 కోట్ల ఓట్లు ఏమయ్యాయి?

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్త పోరాటమని వ్యాఖ్య
- ఓటు హక్కుపై ప్రజల్లో ఉన్న సందేహాలకు సమాధానం చెప్పాలని డిమాండ్
- ఓటర్ల జాబితాపై కేంద్రాన్ని నిలదీసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితాలో కోట్ల సంఖ్యలో ఓట్లు తగ్గిపోయాయంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, దేశంలో జరుగుతున్న నిర సనలు కేవలం కాంగ్రెస్ పార్టీ లేదా రాజకీయ కూటములకు సంబంధించినవి కాదని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని, దానిపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి మహనీయులు తమ జీవితాలను అంకితం చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ప్రతి భారతీయుడికి సమాన ఓటు హక్కు కల్పించారని అన్నారు. పేద, ధనిక, మిగతా 2లో..





## మహాత్మా.. మోదీ, జ్ఞానేశ్‌లకు

# సద్బుద్ధి ప్రసాదించు!

### రాజ్‌ఘాట్ వద్ద ఇండి కూటమి వినూత్న నిరసన..

- మహాత్ముడికి నివాళి అర్పించి..2 గంటలు ధర్నా
- మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, జ్ఞానేశ్ కుట్రలతో దేశాన్ని హైజాక్ చేశారు
- వారికి శిక్షపడటం ఖాయం: రాహుల్‌గాంధీ
- ఇండి కూటమి ఎంపీలకు రెస్టారెంట్‌లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన కాంగ్రెస్
- అక్కడి నుంచి రాజ్‌ఘాట్‌కు వెళ్లిన నేతలు
- పోలీసులపై దాడి చేశారంటూ రాహుల్, ప్రియాంక, నేతలపై మూడు కేసులు నమోదు
- సీఈసీ జ్ఞానేశ్‌కు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత

**న్యూఢిల్లీ:** 'ఓ బాపూ ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌లకు మంచి బుద్ధిని ప్రసాదించు' అంటూ మహాత్మాగాంధీ సమాధి రాజ్‌ఘాట్ వద్ద ఇండి కూటమి నేతలు వినూత్నంగా నిరసన చేపట్టారు. గురువారం మూడు బస్సుల్లో ర్యాలీగా రాజ్‌ఘాట్‌కు వచ్చిన ఇండి కూటమి ఎంపీలు, నేతలు.. మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు. కొంతసేపు మౌనంగా బైఠాయించారు. అనంతరం బీజేపీ ఓటుచోరీకి పాల్పడుతోందని ఆరోపిస్తూ సుమారు రెండు గంటల పాటు ధర్నా చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలంటూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళన గురువారంతో మూడో రోజుకు చేరుకుంది. కాగా, ఈ అంశంలో ఇండి కూటమి నేతలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరారు. కానీ రాష్ట్రపతి కార్యాలయం ఇంకా సమయాన్ని కేటాయించలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

**మూడో రోజూ విందు.. నిరసనలు..**

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలంటూ ప్రతిపక్ష ఇండి కూటమి చేపట్టిన ఉద్యమానికి విందు రాజకీయాలతో ఊపు తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బుధవారం ప్రతిపక్షాల ఎంపీలకు సాగర్‌రత్న హోటల్‌లో విందు ఇచ్చి, తర్వాత అంతా కలిసి ఆందోళనకు మిగతా 2లో..

# ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

- 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని కొనియాడిన ముఖ్యమంత్రి
- దేశాభివృద్ధిలో మోదీ సేవలు ప్రశంసనీయం
- వికసిత్ భారత్ దిశగా దేశాన్ని నడిపిస్తున్న నాయకత్వం



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసిన సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా వివిధ బాధ్యతల్లో పనిచేస్తూ దేశాభివృద్ధికి విశేష కృషి చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రజాసేవలో 25 ఏళ్ల పాలనా అనుభవం సాధించడం అరుదైన ఘనత అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావంతో ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ దేశానికి సేవలందిస్తున్న నాయకుడిగా మోదీ నిలిచారని అన్నారు. పరిపాలనలో చూపిన నిబద్ధత ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. దూరదృష్టి, స్పష్టమైన లక్ష్యాలు, ధైర్యవంతమైన నిర్ణయాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించారని చంద్రబాబు తెలిపారు. సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆర్థిక పురోగతి వంటి రంగాల్లో చేపట్టిన చర్యలు దేశాభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. భారత్‌ను మిగతా 2లో..

# చలో లోక్‌భవన్ ఉద్రిక్తం!

- టీపీసీసీ చీఫ్, మంత్రులు సహా ఇండీ కూటమి నాయకుల అరెస్టు
- సర్ అవకతవకలు, అగ్ర నేతల అరెస్టుపై నిరసన
- లోక్ భారీ ర్యాలీ
- జ్ఞానేశ్ రాజీనామా చేయాలని డిమాండ్
- లోక్‌భవన్ దగ్గరలో అడ్డుకున్న పోలీసులు
- బ్యారికేడ్లను దాటుకుని వెళ్లేందుకు కార్యకర్తల యత్నం
- పోలీసులతో పెనుగులాడిన నాయకులు, మంత్రులు, కార్యకర్తల అరెస్టు





**హైదరాబాద్, అక్టోబరు 8 (వార్త వేదిక సూర్య):** 'సేవ్ డెమోక్రసీ' పేరిట ఇండీ కూటమి నేతలు గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. టీపీసీసీ చీఫ్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వామపక్ష నాయకులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని నినదించారు. 'సర్' ప్రక్రియపై ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రాహుల్, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. దీనికి వామపక్షాలు మద్దతు పలికాయి. ఇందులో భాగంగా ఇండీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఉదయం పది గంటలకే నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వారిలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు మిగతా 2లో..

## జూరాల కాలువకు నీరు వదిలిన

# రైతులపై కేసులు

- నాడు సాగునీరు కోసం జూరాల వద్ద ఆందోళన
- 14 మంది రైతులపై పోలీసు చర్య
- ధర్నా చేసిన నాయకులపైనా కేసుల నమోదు



**వనపర్తి, (వార్త వేదిక సూర్య):** సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో జూరాల ప్రాజెక్టు కాలువకు స్వయంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వ్యవసాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరత కారణంగా తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు కొంతకాలంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. పంటలను కాపాడేందుకు నీరు విడుదల చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని రైతులు వాపోయారు. దీంతో ఆందోళన చెందిన రైతులు గత నెల సెప్టెంబర్ 19న నేరుగా జూరాల ప్రాజెక్టు వద్దకు మిగతా 2లో..



## రైతులపై కేసులు హేయమైన చర్య

- చేతులకు బేడీలు.. పోలీస్ కేసులు కాంగ్రెస్ పాలనలో పరిపాటిగా మారాయి: హరీశ్‌రావు
- రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి.. లేకపోతే పెద్ద ఎత్తున పోరాటం

2 లో..



## అన్నే కార్సన్‌కు సాహిత్య నోబెల్

- సమకాలీన సాహిత్యంలో కొత్త రూపాలకు గుర్తింపు
- ప్రాచీన గ్రీకు సాహిత్యంతో ఆధునిక రచనల మేళవింపు
- 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్'తో విశేష గుర్తింపు

**స్టాక్‌హోమ్:** 2026 నోబెల్ సాహిత్య పురస్కారం కెనడాకు చెందిన రచయిత్రి, కవయిత్రి అన్నే కార్సన్‌కు లభించింది. సమకాలీన సాహిత్యానికి కొత్త రూపాలను అందించిన ఆమె వినూత్న రచనా శైలికి స్వీడిష్ మిగతా 2లో..

# కొత్త జిల్లాల దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- 10, 11న రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- అధికార వికేంద్రీకరణతో తెలంగాణలో మార్పులు వచ్చాయని వెల్లడి



**హైదరాబాద్, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):** తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటుకు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అక్టోబర్ 10, 11 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా దశాబ్ది కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ నాయకులు, శ్రేణులకు పిలుపునిచ్చారు. కొత్త జిల్లాల ఏర్పాటు తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో ఒక చారిత్రక ఘట్టమని, అధికార వికేంద్రీకరణ ద్వారా పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసిన నిర్ణయంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల ఏర్పాటు వల్ల కలిగిన ప్రయోజనాలు, అభివృద్ధి ఫలితాలను ప్రజలకు వివరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అధికార వికేంద్రీకరణ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రజల ముంగిటికే పరిపాలనను తీసుకురావాలనే సంకల్పంతో కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం పరిపాలనా సంస్కరణలను అమలు చేసిందని తెలిపారు. గతంలో ఉన్న 10 జిల్లాలను 33 జిల్లాలుగా విస్తరించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిపాలనా వ్యవస్థ చేరువైందని వివరించారు. కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారా దశాబ్దాలుగా ప్రజలు మిగతా 2లో..

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 141
శుక్రవారం
9 అక్టోబర్, 2026

## జూరాల కాలువకు నీరు వదిలిన రైతులపై కేసులు

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుని కాలువకు నీరు విడుదల చేసినట్లు సమాచారం. రైతులు ప్రాజెక్టు గేట్లను ఎత్తి కాలువల ద్వారా తమ పొలాలకు నీటిని మళ్లించుకున్నారని అధికారులు పేర్కొన్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో జరిగిన ఈ ఘటనపై సాగునీటి పారుదల శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంటూ డిప్యూటీ ఇంజినీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సంబంధిత రైతులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా సాగునీటి విడుదల కోసం ప్రాంతీయ రైతులు, ప్రజాప్రతినిధులు కూడా ఉద్యమబాట పట్టారు. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21న జమ్మిచేడు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సంబంధించి బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా ధర్నా నిర్వహించడం, ప్రజా రవాణాకు అంతరాయం కలిగించడం వంటి ఆరోపణలపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో రైతుల సమస్య మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. పంటలను కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నాలకు కేసులు నమోదు చేయడం పట్ల రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రాజెక్టు నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థకు ఆటంకం కలిగించే చర్యలను ఉపేక్షించలేమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతుండగా, నమోదైన కేసులపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## రైతులపై కేసులు హేయమైన చర్య

హైదరాబాద్, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

కళ్లముందే పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళనకు దిగిన రైతులపై కేసులు నమోదు చేయడం అత్యంత హేయమైన చర్య అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. రైతులపై కేసులు పెట్టడం, పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటని అన్నారు. రేవంత్ పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇంజినీర్లతో రైతులపై కేసులు పెట్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.

ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్న పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు ఆరోపించారు. కడుపు మండిన రైతులు రోడ్డెక్కి తమ సమస్యను పరిష్కరించాలని కోరితే వారిపై అక్రమ కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. రైతులను పోలీసులతో భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమని అన్నారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. నీటిని ఒడిసిపట్టకుండా వదిలేయడం ద్వారా తెలంగాణకు జల ద్రోహం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు శిక్ష అనుభవించాలా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సాగునీరు, విద్యుత్ సమస్యలతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు బదులుగా కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. "ఇది ప్రజా పాలనా? లేక ప్రజా పీడనా?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చర్యలు కొనసాగితే పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు.

# మహాత్మా.. మోదీ, జ్ఞానేశ్‌లకు సద్బుద్ధి ప్రసాదించు!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిన తరహాలోనే.. గురువారం కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విందు ఇచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో మోయెట్స్ రెస్టారెంట్‌లో ఇండి కూటమి ఎంపీలు, నేతలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం మూడు బస్సుల్లో రాజ్‌ఘాట్‌కు బయలుదేరారు.బుధవారం గైర్హాజరైన ఎస్పీ, శివసేన-యూబీటీ, ఎన్సీపీ-ఎస్పీ నేతలు గురువారం విందుకు హాజరై, ఆందోళనలో పాల్గొన్నారు. ఇందులో ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, మరికొందరు కాంగ్రెస్ ఎంపీలతోపాటు టీఎంసీ, ఎస్పీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ ఎంపీలు, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖు కూడా విందులో పాల్గొన్నారు.

### రాహుల్, ప్రియాంకపై 3 కేసులు నమోదు

బుధవారం ఢిల్లీలోని షాంగ్రీలా హోటల్ సమీపంలో పోలీసులపై దాడి చేశారంటూ రాహుల్, ప్రియాంక, మరికొందరు నేతలపై ఢిల్లీ పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. మంగళవారం అనుమతి లేకుండా ఆకాశవాణి భవన్ ప్రాంగణం లోకి ప్రవేశించడం, అధికారిక విధులను అడ్డుకోవ డం, పోలీసులపై దాడి, దురుసుగా ప్రవర్తించడం తదితర ఆరోపణలపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు.

### రాహుల్ మహిళా పోలీసును అనుచితంగా తాకారు: బీజేపీ

ఇండి కూటమి నిరసనల సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక పోలీసులతో అనుచితంగా ప్రవర్తించారని బీజేపీ అధికార ప్రతినిధులు ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ ఆరోపించారు. రాహుల్ గాంధీ ఓ మహిళా కానిస్టేబుల్‌ను అనుచితంగా తాకారని, ప్రియాంకా గాంధీ ఓ మహిళా పోలీసు అధికారిని కడుపులో కొట్టారని.. కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులను కిందపడేసి, కాళ్లతో తన్నారన్నారు.

### ఆ నలుగురికీ శిక్ష పడుతుంది: రాహుల్

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆపే ప్రసక్తే లేదని, ఆయనను తప్పించడం మినహా ప్రధాని మోదీ, అమిత్‌షా చేసేదేమీ లేదని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. దేశంలో పవిత్రమైన ఓటు హక్కు కోసమే తాము పోరాడుతున్నామని చెప్పారు. ''300 మంది ఎంపీలం ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం. మొదటి రోజు ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళుతుంటే అడ్డుకున్నారు. నిన్న జంతర్‌మంతర్‌కు వెళుతుంటే ఆపేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్షపడుతుంది. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు ప్రధాని మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, జ్ఞానేశ్‌కుమార్ కుట్రలు చేస్తున్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి ఓటు చోరీకి పాల్పడ్డారు. కుట్రలతో దేశాన్ని హైజాక్ చేశారు. వారిని న్యాయస్థానం ముందు నిలబెడతాం. వారికి శిక్షపడటం ఖాయం...'' అని రాహుల్ పేర్కొన్నారు. కాగా, విపక్షాల ఆందోళనలు, కాక్రోచ్ జనతా పార్టీ ఈ నెల 10వ తేదీ నుంచి నిరసనలకు దిగుతున్న నేపథ్యంలో కేంద్రం ఢిల్లీలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేసింది. ఢిల్లీ పోలీసులతోపాటు 221 కంపెనీల పారామిలటరీ దళాలను రంగంలోకి దింపింది.

### సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు భద్రత పెంపు

ఇండి కూటమి ఆందోళనలు, కాక్రోచ్ పార్టీ కూ డా నిరసనలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు కేంద్రం భద్రతను మరింత పెంచిం ది. ఇప్పటికే ఆయనకు అత్యుత్తమమైన జెడ్ ప్లస్ భద్రత ఉండగా.. సిబ్బందిని మరింత పెంచారు. సీఆర్‌పీఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని జో డించారు. ఢిల్లీలోని ఆయన నివాసం వద్ద 24 గంట లు పోలీసు బందోబస్తు చేపట్టారు. పారామిలటరీ సిబ్బందిని మోహరించారు. ఈసీ ప్రధాన కార్యాల యం 'నిర్వాచన్ సదన్' వద్ద భద్రత పెంచా రు.

### జూలై 20 నాటి సీజేపీ ఆందోళనలపై ఎఫ్ఐఆర్

జంతర్‌మంతర్ వద్ద జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు జరిగిన ఆందోళనల్లో హింసకు దారితీసిన పరిస్థితులు, దాని వెనుక కుట్రకోణంపై ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్ గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ హింస వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా? దానికి ప్రేరేపించినవారు ఎవరు? నేరచరిత్ర ఉన్న వ్యక్తులు నిరసన ప్రదేశాల్లోకి చొరబడ్డారా? ముందస్తు ప్రణాళికతో విధ్వంసానికి, హింసకు పాల్పడ్డారా? అనే అంశాలపై దర్యాప్తు సాగుతుందని పోలీసువర్గాలు తెలిపాయి. ఆందోళనల సమయంలో అక్కడున్న ప్రతి వ్యక్తి పాత్రను గుర్తించడం, హింసకు ముందు, తర్వాత పంపుకొన్న సందేశాలను పరిశీలించడం కూడా దర్యాప్తులో భాగమని వెల్లడించాయి. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో శనివారం (10వ తేదీన) జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించనున్నట్టు సీజేపీ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఎఫ్ఐఆర్ నమోదుకావడం గమనార్హం.

## చలో లోక్‌భవన్ ఉద్రిక్తం!

(మొదటి పేజీ తరువాయి)

పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, జాన్ వెస్లీ, పోటు రంగారావు తదితరులు ఉన్నారు. అక్కడి నుంచి లోక్ భవన్‌కు భారీ ర్యాలీ కొనసాగింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినందుకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను ప్రాసిక్యూట్ చేయాలని, తొలగించిన 13 కోట్ల ఓట్లను పునరుద్ధరించాలంటూ ఇండీ కూటమి నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ర్యాలీ ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా లోక్‌భవన్ వైపు కొనసాగింది. అయితే, లోక్‌భవన్‌కు 300 మీటర్ల దూరంలో రోడ్డుకు అడ్డంగా బ్యారికేడ్లను ఏర్పాటు చేసిన పోలీసులు.. ఇండీ కూటమి నాయకుల ర్యాలీని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బ్యారికేడ్లను దాటుకుని లోక్‌భవన్ వైపునకు వెళ్లేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు యత్నించారు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు, పోలీసులకు మధ్య పెనుగులాట జరిగింది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై మంత్రులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది నాయకులు, కార్యకర్తలు మరో దారిలో లోక్‌భవన్ వద్దకు వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను అరెస్టు చేసిన పోలీసులు.. వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌ను, మంత్రులను పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించగా, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి సచిన్ సావంత్, కోదండరాంను బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వామపక్ష నాయకులు కూనంనేని, పోటు రంగారావు, ఎంఎం హన్మేశ్, జాన్‌వెస్లీ తదితరులను ఆస్ఫనగర్, చిక్కడపల్లి పోలీసు స్టేషన్లకు తరలించారు. టీపీసీసీ చీఫ్, మంత్రులు పోలీస్ స్టేషన్లోనే కొంతసేపు తమ నిరసనను కొనసాగించారు. తర్వాత టీపీసీసీ చీఫ్, మంత్రులు తమ నిరసనను విరమించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

### జ్ఞానేశ్ రాజీనామా చేసేదాకా పోరాటం: మంత్రి పొంగులేటి

రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, అంతవరకూ తమ పోరాటం ఆగదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోని 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకుపైగా ఓట్లను తొలగించడం సరికాదన్నారు. ఓటర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతిపక్ష పార్టీలను సంప్రదించడం లేదన్నారు. స్థానిక ఓటరు నమోదు అధికారుల అధికారాలను బలహీనపరిచేలా ఈసీనెట్ వ్యవస్థను వినియోగించారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించకుండా అధికార పక్షానికి కొమ్ము కాసేలా నిర్ణయాలు తీసుకుంటోందని మండిపడ్డారు.

## కొత్త జిల్లాల దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి

వ్యక్తం చేస్తున్న ఆకాంక్షలు నెరవేరాయని కేటీఆర్ అన్నారు. గతంలో జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలు 100 నుంచి 150 కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం వల్ల సమయం, వ్యయం రెండూ తగ్గాయని చెప్పారు. జిల్లా కేంద్రాల అభివృద్ధితో పాటు ప్రభుత్వ సేవల సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగిందని వివరించారు. జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య సేవలు, విద్యా సంస్థలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వేగం పెరిగిందని కేటీఆర్ తెలిపారు. కొత్త జిల్లాల అవసరాలకు అనుగుణంగా అనేక ప్రభుత్వ భవనాలు నిర్మించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేశామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలయ్యే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహించే జిల్లా దశాబ్ది కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని విస్తృతంగా కల్పించాలని కేటీఆర్ సూచించారు. జిల్లాల సాధన కోసం ఉద్యమించిన సంయుక్త చర్యా సమితులు, ఉద్యమకారులను సన్మానించాలని, న్యాయవాదుల సంఘాలు, పాత్రికేయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలను కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాల అభివృద్ధిలో వారి పాత్రను గుర్తించి గౌరవించాలని అన్నారు. గత పదేళ్లలో ప్రతి జిల్లా సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, అప్పుడు – ఇప్పుడు విధానంలో వచ్చిన మార్పులను ప్రజల ముందుకు తీసుకురావాలని కేటీఆర్ సూచించారు. ప్రతి జిల్లా తన ప్రత్యేక విజయగాథలను ప్రజలకు తెలియజేయాలని, స్థానిక మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. జిల్లాల ఏర్పాటు కేవలం పరిపాలనా పునర్వ్యవస్థీకరణ కాదని, ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులను ప్రజలకు చేరువ చేసిన చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. తెలంగాణలో జరిగిన ఈ మార్పులను ప్రజలకు గుర్తు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఉప్పు భూముల బదలాయింపు కోరిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

అంశాలను ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి విస్తారమైన తీరప్రాంతం, అనేక ఓడరేవులు ఉండటంతో పోర్టుల ఆధారిత పరిశ్రమలకు అపార అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. తీర ప్రాంతాల్లో పారిశ్రామిక మండలాలు, గిడ్డంగులు, ఎగుమతి కేంద్రాలు, విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆధీనంలోని ఉప్పు భూములను రాష్ట్రానికి బదలాయిస్తే అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయగలమని పేర్కొన్నారు. వాణిజ్య పంటల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే కీలక స్థానంలో ఉందని చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా మిర్చి, పొగాకు, జలకృషి ఉత్పత్తులు వంటి రంగాల్లో రాష్ట్ర రైతులు పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ మరింత విస్తరణకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర రైతులకు మెరుగైన ధరలు లభించేలా అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. ఎగుమతుల పెంపు కోసం అవసరమైన మార్కెట్ అవకాశాలు, నాణ్యత ప్రమాణాలు, ప్రాసెసింగ్ కేంద్రాలు, నిల్వ సదుపాయాలు, రవాణా వ్యవస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడం అత్యంత అవసరమని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి కేంద్రాలు, ఎగుమతి ప్రోత్సాహక మండలాల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని చంద్రబాబు కోరారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను సిద్ధం చేసేందుకు అవసరమైన సాంకేతిక, మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంపుతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం అందించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పోర్టుల అభివృద్ధి, పారిశ్రామికీకరణ, వ్యవసాయ ఎగుమతుల విస్తరణ వంటి అంశాలు రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉప్పు భూముల బదలాయింపు, వాణిజ్య పంటల ఎగుమతుల ప్రోత్సాహానికి అవసరమైన చర్యలు తీసుకుంటే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు ఇతర అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

## వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రారంభానికి రాష్ట్రం సిద్ధం

హైదరాబాద్, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వాటాలతో పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టినట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేయాల్సిన మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నామని, అవి అందిన వెంటనే ఎంపిక ప్రక్రియను ప్రారంభించి రైతులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పక్కన పెట్టిందని మంత్రి తుమ్మల తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2025–26 నుంచి పథకాన్ని పునరుద్ధరించి అమలు చేస్తున్నామని చెప్పారు. 2025–26లో పథకం కోసం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. 2026–27లో రైతులకు మరింత విస్తృతంగా యాంత్రీకరణ ప్రయోజనాలు అందించేందుకు రూ. 147.99 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను తమకు నచ్చిన ఎంప్యానెల్ కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించాలని మంత్రి సూచించారు. నిర్దిష్ట సంస్థ లేదా సరఫరాదారు వద్ద నుంచే పరికరాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి లేకుండా రైతుకు మరింత స్వేచ్ఛ ఉండేలా విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయనున్న నేపథ్యంలో, పరికరం కొనుగోలు చేసే ముందు వివిధ కంపెనీల ధరలు, నాణ్యతను పరిశీలించి తక్కువ ధరకు మంచి నాణ్యత కలిగిన పరికరాన్ని కొనుగోలు చేసుకునే అవకాశం రైతులకు ఉంటుందని మంత్రి తెలిపారు. దీనివల్ల సబ్సిడీ సద్వినియోగం కావడంతో పాటు ఎక్కువ మంది రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం, బీసీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందుతుందని మంత్రి తెలిపారు. సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో పాటు పారదర్శకత పెరుగుతుందన్నారు.



## 13 కోట్ల ఓట్లు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ, పట్టణ, కుల, మత భేదాలు లేకుండా ప్రతి పౌరుడికి ఓటు హక్కు లభించడం వల్లే ప్రజాస్వామ్యం బలపడిందని చెప్పారు. ప్రజలే తమకు నచ్చిన ప్రభుత్వాలను ఎన్నుకునే హక్కు పొందారని, ఆ హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపరచకూడదని పేర్కొన్నారు. దేశంలో జనాభా నిరంతరం పెరుగుతున్నప్పటికీ ఓటర్ల సంఖ్య తగ్గినట్లు కనిపించడం అనేక ప్రశ్నలకు దారితీస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2019లో అది 91 కోట్లకు, 2024లో 97 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం 13 కోట్ల ఓట్లు తగ్గిపోయాయనే పరిస్థితి ఎలా ఏర్పడిందని ప్రశ్నించారు. జనాభా 140 కోట్లకు చేరుకున్న సమయంలో ఓటర్ల సంఖ్య తగ్గిపోవడం వెనుక కారణాలు ఏమిటో దేశ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలను మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో విభజిస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి వర్గానికీ సమాన హక్కులు ఉండాలని, ఓటు హక్కు విషయంలో వివక్షకు తావులేకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బలహీన వర్గాల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వారి హక్కులను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలను కేవలం రాజకీయ కార్యక్రమాలుగా చూడరాదని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కుపై అనుమానాలు తలెత్తినప్పుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని చెప్పారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలను తొలగించి ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు విలువైనదని, ఒక్క ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకూడదని అన్నారు. దేశ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వడంతో పాటు ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని పెంచే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో వెనక్కి తగ్గబోమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అన్నే కార్సన్‌కు సాహిత్య నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

అకాడమీ గుర్తింపు ప్రకటించింది. ప్రాచీన సంప్రదాయాలతో సృజనాత్మక సంభాషణ సాగిస్తూ కొత్త సాహిత్య ప్రక్రియలను సృష్టించినందుకు ఈ పురస్కారం అందిస్తున్నట్లు అకాడమీ తెలిపింది.

### విభిన్న ప్రక్రియల్లో రచనలు

1950లో టొరంటోలో జన్మించిన అన్నే కార్సన్ కవయిత్రి, వ్యాసకర్త, అనువాదకురాలిగా గుర్తింపు పొందారు. ప్రాచీన గ్రీకు సాహిత్యంపై ఆమెకున్న పట్టు ఆమె రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. కవిత్వం, గద్య రచన, సంభాషణలు, అనువాదాలను కలిపి ప్రత్యేకమైన రచనా శైలిని అభివృద్ధి చేశారు. 1986లో వెలువడిన 'ఎరోస్ ది బిటర్‌స్వీట్', 1995లో వచ్చిన 'గ్లాస్, ఐరనీ అండ్ గాడ్' వంటి రచనలతో ఆమె సాహిత్య ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. 1998లో ప్రచురించిన 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్: ఎ నవల్ ఇన్ వర్స్' ఆమెకు అంతర్జాతీయంగా విశేష ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ఇందులో ప్రాచీన గ్రీకు పురాణంలోని గెరియన్ పాత్రను ఆధునిక దృష్టితో పునర్‌ఆవిష్కరించారు.

### 'నాక్స్'తో సోదరుడి జ్ఞాపకాలు

2001లో ఆమె రాసిన 'ది బ్యూటీ ఆఫ్ ది హజ్బెండ్: ఎ ఫిక్షనల్ ఎస్సే ఇన్ 29 టాంగోస్' కూడా ప్రముఖ రచనగా నిలిచింది. కవిత్వం, వ్యాసం, కథన శైలులను మేళవిస్తూ వైవాహిక జీవితంలోని సంక్లిష్టతలను ఇందులో ఆవిష్కరించారు. 2010లో వచ్చిన 'నాక్స్'లో తన సోదరుడు మైఖేల్ జ్ఞాపకాలను ఫొటోలు, లేఖలు, ఇతర రచనా రూపాలతో మేళవించారు. అన్నే కార్సన్ రచనలు సాహిత్యంలోని సంప్రదాయ విభజనలను దాటి కవిత్వం, గద్యం, పురాణాలు, అనువాదం, దృశ్యకళలను కలిపిన ప్రత్యేక శైలికి పేరుగాంచాయి. ఆమెకు లభించిన 2026 నోబెల్ సాహిత్య పురస్కారం విలువ 1.2 కోట్ల స్వీడిష్ క్రోనర్లు.

## ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ వేదికపై మరింత బలమైన దేశంగా నిలబెట్టడంలో ప్రధానమంత్రి పాత్ర కీలకమని అన్నారు. సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తూ రాష్ట్రాలను అభివృద్ధి భాగస్వాములుగా తీసుకెళ్తున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. కేంద్ర-రాష్ట్రాల సమన్వయంతో దేశాన్ని వికసిత్ భారత్ లక్ష్యం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర అభివృద్ధిని సాధించే దిశగా చర్యలు చేపడుతున్నారని వివరించారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచడంలో ప్రధానమంత్రి కృషి ప్రశంసనీయమని చంద్రబాబు అన్నారు. ప్రపంచ దేశాలతో సంబంధాలను బలోపేతం చేస్తూ భారతదేశానికి విశ్వసనీయత, గౌరవాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక రంగాల్లో భారతదేశ స్థాయిని మరింత ఉన్నత స్థాయికి చేర్చేలా నాయకత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

https://epaper.vaarthavedikasurya.com PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY




# యాదాద్రి భువనగిరి

## మరణించిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**మోటకొండూరు, అక్టోబరు 8(వార్త వేధిక సూర్య):**

మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆడెపు రవీందర్ ఇటీవల మృతి చెందారు. కష్టకాలంలో ఉన్న ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు చాడ జెడ్పీహెచ్ఎస్ 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు ముందుకొచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారి వంతుగా రూ. 8,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. తమ స్నేహితుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రులు జెట్ట మహేందర్, ముస్తాల కృష్ణ, పంగ ప్రభాకర్, రాంపల్లి అమరేందర్, ఆడెపు వెంకటేష్, ఆడెపు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకు ఉత్తమ అవార్డ్స్



**బీబీనగర్, అక్టోబర్ 9, (వార్తా వేదిక సూర్య)**

యాదాద్రి భువనగిరి జిల్లా బిబినగర్ మండలం పలు గ్రామపంచాయతీలకు క్షయరహిత గ్రామాలు జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిబి ముక్త్ భారత్ భాగముగా మహాదేవపురం మీది తండా మాదారం క్షయ రహిత గ్రామాలుగా ఎంపిక చేశారు ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహాదేవపురం సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్ మీది తండ సర్పంచ్ సురేష్ నాయక్ మాదారం సర్పంచ్ మందాడి వెంకటరెడ్డి ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డు అందుకున్నారు ఇందులో భాగంగా గ్రామాలలో క్షయ వ్యాధి లక్షణాలు నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించడం చేశారు వ్యాధి వ్యాప్తిపై అరికట్టేందుకు గ్రామాలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ అవార్డులు కలెక్టర్ కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేద్ రెహమాన్ సిప్తీ భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ చేతుల మీదుగా సర్పంచులు ఉత్తమ అవార్డులు తీసుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు మరియు బీబీనగర్ మండల్ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మరియు జిల్లా అధికారులు గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## అరెస్టుకు నిరసనగా దిష్టిబొమ్మ దగ్ధం



**రామన్నపేట, అక్టోబర్ 08 (వార్తా వేదిక సూర్య):**

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ నిరసన కార్యక్రమానికి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో సుభాష్ సెంటర్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్ గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బిక్షం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ పూస బాలకిషన్, అబ్రహం కుమార్, గుత్తా నర్సిరెడ్డి, , వనం చంద్రశేఖర్, ఎండీ అక్రమ్, అంజిరెడ్డి, ఎండీ నాసర్, శంబాల వెంకన్న, కోట సుధాకర్, బొడ్డు సురేందర్‌రావు, అయ్యాడపు నర్సిరెడ్డి, లింగారెడ్డి, ఇనాయత్ బేగ్, జానీ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయికి విద్యార్థులు దూరంగా ఉండాలి

**మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు నాశనం**
**విద్యార్థులు చెడు వ్యసనాలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**
**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు లావుడియ రాజు, వేముల నాగరాజు**




**యాదాద్రి భువనగిరి, (వార్త వేదిక సూర్య):**

డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎసిపి శ్రీనివాస్ నాయుడు అన్నారు, గురువారం రోజున యాదగిరి గుట్ట పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలు ప్రమాదం, సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన సదస్సు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది , ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థులు యువకులు మత్తుపదార్థులకు గురవుతున్న పరిస్థితి ఉన్నది, విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చదువుపై ప్రభావం, కుటుంబం మరియు సమాజంపై పడే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు, గ్రామాల్లో ప్రజలందరికీ ప్రజలందరూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు, అదేవిధంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి లు లావుడియ రాజు,వేముల నాగరాజు లు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, విజ్ఞానం మరియు సామాజిక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. యువతను మత్తు పదార్థాల వైపు ఆకర్షించే ప్రయత్నాలను అడ్డుకోవాలని, విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల అక్రమ విక్రయాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. విద్యార్థులకు కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు,సోషల్ మీడియాను విద్యార్థులు బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, తప్పుడు సమాచారం మరియు మత్తు పదార్థాలను ప్రోత్సహించే కంటెంట్‌కు దూరంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలు డ్రగ్స్ తీసుకొని అమ్మాయిల పైన అత్యాచారాలు జరుగుతా ఉన్నాయి, ప్రభుత్వాలు మారుతున్న గాని అత్యాచారాలు అరికట్టడంలో విఫలం అవుతున్నారు,దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయి, బేటి బచావో బేటి పడావో అని నినాదం ఇచ్చిన బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రోజుకు అత్యాచారాలు జరుగుతా ఉన్నది. మహిళలపై రక్షణ లేకుండా పోతున్నది, ప్రభుత్వాలు సి టీంలు తెచ్చిన, షో టీమ్ గా మారిన పరిస్థితి ఉన్నది, మహిళల రక్షణ కోసం ప్రత్యేకమైనటువంటి చట్టాలు తీసుకురావాలని యువత సమాజంలో జరుగుతున్న అసమానతలు డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడాలని ఈ దేశం కోసం తన చిన్నతనంలోనే ఉరికంబాన్ని ఎక్కిన భగత్ సింగ్ స్ఫూర్తిని తీసుకొని యువత ముందుండాలని అన్నారు...ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ రామనాయుడు, హెచ్వోడి రాజగోపాల్ రెడ్డి ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఇందు రాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# గత పాలనే స్వర్ణయుగం ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజా సమస్యలు గాలికి!

**సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు ఎర్ర సోమిరెడ్డి ధ్వజం**

**ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 08 (వార్త వేదిక సూర్య):**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు నిలిచిపోయి, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు, లింగరాజుపల్లి గ్రామ సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు.



### గత బీఆర్ఎస్ పాలనే సంక్షేమానికి మార్గదర్శి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ గ్రామాలు అభివృద్ధిపథంలో పయనించాయని ఆయన గుర్తుచేశారు. "రైతు బంధు", "రైతు బీమా", "దళిత బంధు", "ఆసరా పింఛన్లు", మరియు ఉచిత విద్యుత్ వంటి విప్లవాత్మక పథకాలతో ప్రతీ ఇంటా సంతోషం వెల్లివిరిసిందని కొనియాడారు. కేసీఆర్ హయాంలో రైతులకు సాగునీరు, తాగునీరు సమృద్ధిగా అంది గ్రామ రూపురేఖలే మారిపోయాయని తెలిపారు.

### హామీలు నీటి మూటలు –పథకాలు అందని ద్రాక్ష

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకం కూడా సరైన రీతిలో ప్రజలకు అందడం లేదని సోమిరెడ్డి ఆరోపించారు. రైతులకు ఇవ్వాల్సిన భరోసా, రుణమాఫీ వంటి హామీలు అమలుకాక అప్పై చేసుకున్న లబ్దిదారులు నిరాశలో ఉన్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ ఫలాలు అందక ప్రజలు, రైతులు తీవ్ర నిరాశానిస్పృహల్లో ఉన్నారని, పథకాలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు.హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ట్రస్మా మండల నూతన కమిటి ఎన్నిక



**రామన్నపేట, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**

ట్రస్మా ( తెలంగాణ రికాగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్) రామన్నపేట మండల నూతన కమిటిని గురువారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకుర్ల వెంకటేశం సమక్షంలో జరిగిన సమావేశంలో మండల కమిటీ గౌరవ సలహాదారుగా తిరుగుల మల్లికార్జున్ ( వివేకానంద స్కూల్), గౌరవాధ్యక్షుడు గా గంగుల నరేందర్ రెడ్డి ( క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్), కమిటి ప్రెసిడెంట్ గా జె ఎస్ మార్టిన్ ( మదర్ థెరీసా స్కూల్), వర్కింగ్ ప్రెసిడెంట్ గా కనకాచారి ( చైతన్య విద్యాలయం, ఇంద్రపాలనగరం), ప్రధాన కార్యదర్శి గా నకిరేకంటి నాగరాజు ( నాగార్జున స్కూల్), కోశాధికారిగా కె. శ్రీధర్ ( పల్లవి స్కూల్) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో, పూల మాలలతో సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీరాములు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మెరుగు మధు, జిల్లా నాయకులు మిర్యాల దుర్గా ప్రసాద్, కాసుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని యువకుడు మృతి

**వలిగొండ: అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య )**

వలిగొండ మండల పరిధిలోని ఏదుల్లగూడెం గ్రామ శివారులో గురువారం ఉదయం నోముల రామచంద్ర వ్యవసాయ భూమిలో ఉన్న వేప చెట్టుకు జంగిటి కర్ణాకర్, వయస్సు 25 సంవత్సరాలు, చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి స్వస్థలం వసంతపురం గ్రామం, రాజాపేట మండలం,మృతుడు ఇంటర్ వరకు చదివి అనంతరం చదువు మానివేసి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడని, గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచుగా మద్యం సేవించేవాడని, మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినప్పటికీ వినేవాడు కాదని మృతుడి తండ్రి జంగిటి బిక్షపతి తెలిపాడు. రెండు రోజుల క్రితం మద్యం సేవించడానికి డబ్బులు అడగగా తండ్రి డబ్బులు లేవని మందలించడంతో తన సెల్‌ఫోన్‌ను విక్రయించి మద్యం సేవించినట్లు, అనంతరం కొత్త సెల్‌ఫోన్ కొనుగోలు చేయడానికి డబ్బులు అడగగా కుటుంబ సభ్యులు డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై మృతిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

## చెర్క జగన్నాథం ఆశయ సాధనకు పునరంకితమవుదాం



**వలిగొండ: అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య )**

గోకారం మాజీ సర్పంచ్ అమరజీవి కామ్రేడ్ చెర్క జగన్నాథం ఆశయాలను సాదించేందుకు నిరంతరం కృషి చేస్తూ ఆయన ఆశయ సాధనకు పునరంకితం అవుదామని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మద్దెల రాజయ్య,సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు అన్నారు. గురువారం రోజున చెర్క జగన్నాథం 29 వ వర్ధంతి సందర్భంగా గోకారం,వలిగొండ మండల కేంద్రంలోని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెర్క జగన్నాథం చిన్నతనంలోనే వామపక్ష భావాలకు ఆకర్షితుడై యువజన సంఘం నాయకుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి సిపిఎం పార్టీ నాయకుడిగా నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ గ్రామ సర్పంచ్ గా ఎదుగడాన్ని చూసి ఓర్చుకొని స్వార్థపర శక్తులు అభివృద్ధి వ్యతిరేకులు నక్సలైట్లతో చేతులు కలిపి వలిగొండ మండల కేంద్రంలో మధ్యాహ్నం పూట దారుణంగా హత్య చేయించారని అన్నారు. జగన్నాథాన్ని చంపినంత మాత్రాన సిపిఎం వెనక్కి పోలేదని మరింత ముందుకు పోతూ ప్రజలకు అంటిపెట్టుకొని అనేక ప్రజా పోరాటాలు కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం,కూర శ్రీనివాస్,గోకారం శాఖ కార్యదర్శి మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్,మండల కమిటీ సభ్యులు చీర్క శ్రీశైలం రెడ్డి,దుబ్బ లింగం,బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి,వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, సహాయ కార్యదర్శి నానచర్ల రమేష్,నాయకులు పబ్బు నారాయణ,చెర్క వెంకటేశం,పబ్బు యాదగిరి,నారి రామస్వామి,కొండూరు సత్తయ్య,శీలం ఇందిర,మద్దెల మారయ్య,వేముల నాగరాజు,ధ్యానబోయిన యాదగిరి,చేగూరి నగేష్, రాపోతు వెంకులు,రావుల ఈశ్వరయ్య,గుర్రం సత్తిరెడ్డి,మైసోల్ల నరేందర్, చెర్క బాలరాజు,ఎడవెల్లి రాములు,నారి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతే ముఖ్యం

**ముత్తిరెడ్డి గూడెం చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు: బారికేడ్లకు రేడియం స్టిక్కర్ల అంటింపు**

**మోటకొండూరు, అక్టోబర్ 8 (వార్త వేధిక సూర్య):**

సమాజంలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మోటకొండూరు సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) కుమారస్వామి యాదవ్ సూచించారు. గురువారం మండలంలోని ముత్తిరెడ్డి గూడెం జంక్షన్ (చౌరస్తా) వద్ద పోలీసుల ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై స్థానికులకు, వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ... మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని, ఆపదలో ఉన్నప్పుడు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్నారుల భద్రత పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల కూడా జాగ్రత్త వహించాలని ఆయన వివరించారు.

### బారికేడ్లకు రేడియం స్టిక్కర్లు



అనంతరం ముత్తిరెడ్డి గూడెం చౌరస్తాలో వాహనాల రద్దీ, ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు బారికేడ్లు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఎస్సై ముందస్తు చర్యలు తీసుకున్నారు. చౌరస్తాలో జిగ్ జాగ్ పద్ధతిలో ఉన్న బారికేడ్లకు గతంలో అంటించిన రేడియం స్టిక్కర్లు పాడై పోవడంతో, వాటి స్థానంలో ఎస్సై స్వయంగా పర్యవేక్షించి మళ్లీ కొత్తగా రేడియం స్టిక్కర్లను వేయించారు. దీనివల్ల రాత్రివేళల్లో వాహనదారులు బారికేడ్లను సులభంగా గుర్తించి ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు.రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్సై వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. పండుగల సమయం దగ్గర పడుతున్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు.

## జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలి

**అడ్డగూడూర్, అక్టోబర్ 8(వార్తా వేదిక సూర్య) :**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్జ్ఞానేష్ కుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపట్టారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహులు, ప్రియాంక గాంధీలను అక్రమంగా పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ఖండిస్తూ గురువారం అడ్డగూడూరు మండలం కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే అతనిని సస్పెండ్ చేసి ఓట్ల జాబితా అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా మార్చి నిర్వహిస్తున్న రాహుల్, ప్రియాంక గాంధీ లను పోలీసులు అక్రమంగా అరెస్టు



చేయడం సిగ్గుచేటని అన్నారు. రాబోవు రోజులలో ప్రజలు బిజెపి పార్టీకి ఓట్లతోనే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మనగోటి జ్యోతి, సర్పంచులు చేడ అంబేద్కర్, బాలశౌరి, నాయకులు పూల పెళ్లి సోమిరెడ్డి, పాశం సత్యనారాయణ, బొమ్మగాని లక్ష్మయ్య, వల్లంబట్ల రవీందర్, బాలెముల విద్యాసాగర్, గూడెం పాండు, కడారి రమేష్, చిత్తలూరి సోమన్న, బైరెడ్డి సందీప్ రెడ్డి, నాగులపల్లి రమేష్, పూలపల్లి రాజశేఖర్ రెడ్డి, చెరుకు వెంకన్న, మందుల వెంకటేష్, కడారి నాగరాజు, తోట గోపి, దప్పు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి: 2
సంచిక: 141
శుక్రవారం
9 అక్టోబర్, 2026

## గ్రంథాలయానికి 115 పుస్తకాల వితరణ

మోత్కూరు, అక్టోబర్ 8 ( వార్త వేదిక సూర్య);

మోత్కూరు శాఖ గ్రంథాలయానికి అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన అర్చకులు శ్రీధర్ శర్మ వారి సహోదరి పాలకుర్తి గిరిజ కలిసి 115 పోటీ పరీక్షలకు చెందిన ఆధ్యాత్మిక తవి, కథలు, రచనలు, ఇతర పుస్తకాలను గురువారం లైబ్రరీ ఇంచార్జి బాబుచారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము బాల్య దశలో మోత్కూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నామని, ఈ ప్రాంత విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పోటీ పరీక్షలకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గ్రంథాలయ పూర్వ కార్యదర్శి ఎస్.ఎన్. చారి, గ్రంథాలయం ఉపాధ్యక్షులు పోచం బిక్షపతి, గ్రంథాలయం ఇంచార్జ్ సిహెచ్ బాబు చారి, గ్రంథాలయం కమిటీ సభ్యులు ఆర్.ప్రణతి, కప్పే యాకేష్, ఎండి రఫీ, శంకరాచారి, పాఠకులు బయ్యని రాజు,మందుల మల్లేష్,నవీన్ రాములు,జహంగీర్ రామచంద్రు,మర్రి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## సన్న రకం ధాన్యానికి బోనస్ పెంచాలి

మోత్కూరు, అక్టోబర్ 8 ( వార్త వేదిక సూర్య):



రాష్ట్రంలో సన్న రకం పండిస్తున్న రైతాంగానికి క్వింటాకు 1500 రూపాయలు బోనస్ ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని బిజెపి జిల్లా నాయకులు, ఓబీసీ మోర్చా జనగామ జిల్లా ఇంచార్జీ పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్ నీలో ప్రభావంతో సన్న రకం వరికి విపరీతమైన తెగుళ్లు పట్టాయని,ఆశించిన రీతిలో పంట దిగుబడి చాలా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల సన్నధాన్యానికి మద్దతు ధర బోనస్ లేకుండా ప్రైవేట్ వ్యాపారస్తులు 4000 నుండి 4,500 వరకు పచ్చిధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.ఈ ప్రైవేట్ వ్యాపారస్తులు సన్నధాన్యం కొనుగోలు చేయడం వలన తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ షాపులో సన్న బియ్యం పథకం ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి ఎక్కువ మద్దతు ధర రైతులకు చెల్లించి, సేకరించుటలో ఇబ్బందులు లేకుండా చేసి బలహీన వర్గాలకు రేషన్ షాపులో ఇచ్చే సన్నబియ్యానికి ఆటంకం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 13న సమ్మె తప్పదు: ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్



భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 13న సమ్మె నిర్వహించాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 13న చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును గురువారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు ఉద్యోగ నాయకులు తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఇమ్రాన్ కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 13న సమ్మె నిర్వహించడం అనివార్యమవుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మద్దతుగా టీఎన్‌జీవో నాయకులు వెంకట్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎం.డి. జమాల్, ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉద్యోగ నాయకులు కార్యక్రమానికి హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డాక్టర్ షాహిద్ అలీ, నెహ్రూ, నర్సింహా, శ్రీనివాస్, మురళి, వినోద్, లావణ్య, గీత, భవాని, సుమలత పాల్గొన్నారు.

# ఓటు హక్కు పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మోదీ సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మల దహనం



మోత్కూరు,అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపు ఆరోపణలకు నిరసనగా న్యూఢిల్లీలో రాహుల్ ప్రియాంక గాంధీ అరెస్టుల నిరసనగా మోత్కూరు పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ పట్టణ,మండల కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా మండల పట్టణ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ బద్దం నాగార్జున రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లులు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో బిజెపి, ఎన్నికల సంఘం చేస్తున్న ఓట్ల చోరీపై జరుగుతున్న నిరసనలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తే రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ఆయుధమని,ఆ హక్కును హరించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమన్నారు.ఓట్ల తొలగింపు,ఓట్ల చోరీ వంటి పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్పాలని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కంకణబద్ధుడై పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి కూరెళ్ళ శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, గద్దం సోమ నర్సయ్య, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి,అన్నెపు పద్మ, ముద్దం జయశ్రీ మందుల సురేష్ పురుగులనర్సింహ్మా, ఎడ్ల భగవంత్, వంగరి రాములు, దేవరపల్లి రంగారెడ్డి, అర్థ ప్రతాప్ రెడ్డి,వర్రె హరిప్రసాద్,గద్దం లక్ష్మయ్య, గంజి మంగమ్మ పల్లెర్ల భాస్కర్ బత్తిని ధర్మయ్య,బందెల రవి శేఖరాచారి,తాటిపాముల బ్రహ్మాచారి, కస్తూరి వీరస్వామి పాల్గొన్నారు .

# మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేయూత

మోత్కూరు, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):



.మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని 11వ వార్డు అన్నెపు బజార్ లో 1982లో మోత్కూరు తాలూకా స్థాయి గౌడ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 10 గుంటల భూమిలో గౌడ మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్,బీసు శ్రీకాంత్ గౌడ్ లు రాష్ట్ర ఆర్ అండ్ బి,సినిమా టోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఇటీవల. విన్నవించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ఆయన నివాసంలో మరోసారి మంత్రిని మర్యాదపూర్వకంగా కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. దీంతో తక్షణమే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన కుమారుడు ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినీ ఫంక్షన్ హాల్ కోసం రూ.20 లక్షలు స్వంత నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి స్వయంగా ప్రకటించారు. తక్షణమే రూ 10 లక్షలు డిసిసి మాజీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి చేతుల మీదుగా కౌన్సిలర్లకు అందించి ఫంక్షన్ హాల్ పనులను ప్రారంబించాలని కోరారు ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు 50% పూర్తైన అనంతరం మరో 10 లక్షలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మోత్కూరు తాలూకా స్థాయి పరిధిలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ తరపున రూ.20 లక్షలు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి కౌన్సిలర్లు వెంకన్న గౌడ్ ,శ్రీకాంత్ గౌడ్ లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణంతో మోత్కూరు, అడ్డగూడూరు,గుండాల, ఆత్మకూరు(ఎం), మండలాల గౌడ సామాజిక వర్గానికి సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా అడ్వకేట్ పర్రెపాటి యుగంధర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అవిశెట్టి అవిలిమల్లు, కౌన్సిలర్లు మొగుళ్ల అనురాధ మెంట రమణ కురిమిళ్ల ప్రమీల కాంగ్రెస్ నాయకులు మెంట నగేష్ కురిమిళ్ల రాములు మొగుళ్ల శ్రీనివాసరెడ్డి,మెంట సురేష్, ఆలకుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి భువనగిరి

# టీబీ రహిత గ్రామంగా ఎంపిక

### సర్పంచ్ జన్నె సిద్ధులు పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్ కి సిల్వర్ మెడల్ ప్రదానం

### జిల్లా కలెక్టరేట్‌లో ఘన సత్కారం



మోటకొండూరు,అక్టోబర్ 8 (వార్త వేధిక సూర్య):-

ప్రజారోగ్య పరిరక్షణలో మోటకొండూరు మండలంలోని మాటూరు గ్రామం ఆదర్శంగా నిలిచింది. పటిష్టమైన వైద్య సేవలు, గ్రామస్తుల సహకారం, పారిశుధ్య చర్యలతో ఈ గ్రామం టీబీ (క్షయ) రహిత గ్రామంగా ఎంపికై అరుదైన ఘనత సాధించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో మాటూరులో క్షయ వ్యాధిగ్రస్తులు ఎవరూ లేరని, వ్యాధి పూర్తిగా నియంత్రణలో ఉందని నిర్ధారణ కావడంతో ఈ గుర్తింపు దక్కింది.ఈ అద్భుత సాధనకు గుర్తింపుగా జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జన్నె సిద్ధులు, పంచాయతీ కార్యదర్శి నందాల సాయికుమార్‌లను అధికారులు ఘనంగా సత్కరించారు. డీఎంహెచ్‌ఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, భువనగిరి మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా వారు ప్రశంసాపత్రంతో పాటు సిల్వర్ మెడల్ (రజత పతకం) స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన సర్పంచ్, కార్యదర్శితో పాటు క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. గ్రామస్తుల్లో క్షయ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించడం, లక్షణాలు ఉన్న వారికి వెంటనే పరీక్షలు చేయించి సరైన వైద్యం అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. మాటూరు గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకొని మండలంలోని ఇతర గ్రామాలు కూడా ఆరోగ్య రక్షణలో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. టీబీ రహిత గ్రామంగా జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన సర్పంచ్ సిద్ధులు, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్‌లను మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం.



మోత్కూరు, అక్టోబర్ (వార్త వేదిక సూర్య):

మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన కమ్మగాని మల్లమ్మ ఇటీవల మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన మల్లమ్మ కుటుంబానికి ఆమె కుమారుడు కమ్మగాని సైదులుతో బాల్య దశలో విద్యాభ్యాసం చేసిన 1996-1997 బ్యాచ్ దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం స్నేహితున్ని కుటుంబాన్ని పరామర్శించి మల్లమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్నేహితుల నుండి సేకరించిన రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని సైదులుకు అందజేసి తమ ఆత్మీయతను చాటుకున్నారు. తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న స్నేహితులకు సైదులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె వీరేశం, పి రమేష్, ఈ యాదయ్య,సిహెచ్ స్వామి, ఎల్ సతీష్ రెడ్డి,ఏ నరేందర్, ఎం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ సేవలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి

### మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్




మోత్కూరు, అక్టోబర్ 8 ( వార్త వేదిక సూర్య);

రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ కోరారు.గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన కిషోర్ కుమార్ ను ఇటీవల రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్లుగా ఎన్నికైన కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, ఎస్ఎన్ చారిలు మర్యాదపూర్వకంగా కలిశారు. కిషోర్ కుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి ఎస్ ఎన్ చారి లను శాలువాలతో సన్మానించారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్, జంగ శ్రీను,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు తీపిరెడ్డి మేఘారెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య మాజీ పిఎసిఎస్ చైర్మెన్ పొన్నాల వెంకటేశ్వర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్పంలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మోత్కూరు, అక్టోబర్ 8 ( వార్త వేదిక సూర్య);



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్' లో భాగంగా మండలంలోని పాలడుగు గ్రామంలోని పీఎం శ్రీ పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను గురువారం నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు షీల్డులు, బహుమతులు అందజేశారు. వ్యాసరచనలో.. మొదటి 7బహుమతి – గుంటోజు అమూల్య రెండో బహుమతి – చెలగొల్ల సాక్షిత చిత్రలేఖనం పోటీలో మొదటి బహుమతి – మాతంగి భవ్య శ్రీ రెండో బహుమతి – కొసన అవంతిక గెలుపొందినట్లు మండల భాజపా అధ్యక్షులు గూదే మధుసూదన్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ, నరేంద్ర మోదీ 2001 సంవత్సరం నుంచి ప్రజాజీవితంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ 25 ఏళ్లుగా దేశ సేవకు అంకితమైయ్యారని అన్నారు. దేశ సేవ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కార్యక్రమాలను విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, మండల నాయకులు నాగం సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ముక్కామల గణేష్,స్థానిక నాయకులు ఆళ్ల శివప్రసాద్, మహేష్, నరేష్, అజయ్, పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవ పురస్కరించుకొని బిజెపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో అంగన్వాడి టీచర్ చింతల విజయ,ఆయా బాసాని మమతలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న అంగన్వాడి సేవలను గుర్తించి గౌరవించడం అభినందనీయమన్నారు.

## జర్నలిస్టుకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

మోత్కూరు, అక్టోబర్ 8 ( వార్త వేదిక సూర్య);



ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మోత్కూరు పట్టణానికి చెందిన ఈటీవీ ఛానల్ మీడియా ప్రతినిధి చేపూరి అనిల్ ను గురువారం తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ పరామర్శించారు. అనంతరం రూ..10,000 (పది వేలు రూపాయలు ) ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అనిల్ ను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్,జంగ శ్రీను పాల్గొన్నారు.

## మధుకు అండగా నిలిచిన వాట్సాప్ గ్రూప్ సభ్యులు

అడ్డగూడూర్, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య)

తల్లిదండ్రులను కోల్పోయిన మధుకు వాట్సప్ గ్రూపుల సభ్యుల అండదండలతో ఆర్థిక సహాయం అందింది. అడ్డగూడూరు మండలంలోని చిన్న పడి శాల గ్రామానికి చెందిన గొర్ల లింగయ్య గత ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కొంతకాలం తర్వాత అతని భార్య యాదలక్ష్మి కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుమారుడు మధు ఒంటరి వాడయ్యాడు. తల్లిదండ్రుల ఇద్దరినీ కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధు పరిస్థితిని తెలుసుకున్న గ్రామ వాట్సాప్ గ్రూప్ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి, తమ వంతుగా విరాళాలు సేకరించారు. అంబటి అనిల్ గౌడ్, ఓర్సు నవీన్, సంజీవ్, నరేష్, కృష్ణారెడ్డి, ఉమేష్ , అఖిల్, ప్రభు , సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

https://epaper.vaarthavedikasurya.com
PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY




# నల్లగొండ

## యశోదలో మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీలు



నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య )

ఛాతీకి సంబంధించిన సంక్లిష్ట వ్యాధులకు చిన్న కోతలతో శస్త్రచికిత్స చేసే ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని సోమాజిగూడ యశోద ఆసుపత్రి థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్‌రెడ్డి సి తెలిపారు. వీడియో కెమెరా, రోబోట్ సహాయంతో చేసే శస్త్రచికిత్సలతో కోత, నొప్పి తగ్గడంతో పాటు రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. నల్గొండలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతీ మధ్యభాగం, డయాఫ్రమ్, ఛాతీ గోడకు సంబంధించిన పలు వ్యాధులకు ప్రస్తుతం ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరాన్ని బట్టి వీడియో కెమెరా ఆధారిత శస్త్రచికిత్స (వీఏటీఎస్), రోబోట్ సహాయంతో చేసే శస్త్రచికిత్స (ఆర్ఏటీఎస్) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో ఏర్పడే కణితులను తొలిదశలో గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని పేర్కొన్నారు. గత పదేళ్లలో ఛాతీ శస్త్రచికిత్సల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని, చిన్న కోతలతో సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా కచ్చితత్వంతో నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. రోగి పరిస్థితిని బట్టి వివిధ వైద్య విభాగాల నిపుణులు కలిసి చికిత్స అందించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. యశోద ఆసుపత్రిలో ఛాతీ శస్త్రచికిత్స నిపుణులతో పాటు ఊపిరితిత్తులు, క్యాన్సర్, రేడియాలజీ, మత్తు వైద్యం, అత్యవసర చికిత్స నిపుణుల బృందం సేవలందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ వినోద్ పాల్గొన్నారు.

## పాత పల్లెలో ఉచిత కంటి పరీక్షల శిబిరం



నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య )

లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో విజన్ సర్వీస్ వీక్‌లో భాగంగా గురువారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడో వార్డు పాత పల్లెలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి–అశోక్ చంద్ర ఆహ్వానం మేరకు, లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పిలుపుతో ఇషా ఐ హాస్పిటల్ సౌజన్యంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 60 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 20 మందికి కంటి అద్దాలు అవసరమని, నలుగురికి కాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ నిమ్మల పిచ్చయ్య ఎంజేఎఫ్, ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ తంతనపల్లి సైదులు ఎంజేఎఫ్, క్లబ్ అధ్యక్షుడు లయన్ బుర్రి కృష్ణశేఖర్, కార్యదర్శి లయన్ ముప్పిడి మల్లయ్య, జీఎస్టీ కోఆర్డినేటర్ లయన్ ములక నాగిరెడ్డి, లయన్ బాలబ్రహ్మం, లయన్ కృష్ణయ్య, క్లబ్ కోశాధికారి లయన్ నాగేశ్వరరావు,మూడో డివిజన్ కార్పొరేటర్ పేర్ల అశోక్, గుండు కోటయ్య, గాలి మురళి , కొత్తపల్లి మల్లేష్, సంతోష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య )



కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. నరసింహారెడ్డి పరినే మాట్లాడుతూ.. తెలంగాణ పండుగలు ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తాయని అన్నారు. బతుకమ్మలో సహజ పూలను వినియోగించడం ద్వారా ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం స్పష్టమవుతుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లోని ప్రకృతి పరిరక్షణ సందేశాలను యువతరం తెలుసుకుని, భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు స్వప్న, మానస, భవాని, యామిని, అంజలి తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

### బస్–నిచ్చెన గుర్తుపై ఓటేయాలని కోరిన పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య )

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, పెండింగ్ బకాయిల చెల్లింపు, పీఆర్సీ, పదోన్నతులు, సిబ్బంది కొరత నివారణ వంటి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల ఆసుపత్రి బీమా, పిల్లల ఉన్నత విద్యకు ప్రత్యేక పథకం అమలు చేయాలని కోరారు. ఈ నెల 9 న జరిగే ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, బస్–నిచ్చెన గుర్తుపై ఓటు వేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ ధర్నాలతో రాజకీయ వేడి

ఆలేరు, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

ఆలేరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు నిర్వహించిన ధర్నా కేవలం రాజకీయ ఉనికి చాటుకునేందుకేనని మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ విమర్శించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధికి ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీలో తాము చేపట్టిన అభివృద్ధిని ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆమె సవాల్ చేశారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### సీఈసీ రాజీనామా చేయాల్సిందే: కాంగ్రెస్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, లేదా కేంద్ర ప్రభుత్వం ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆలేరులో కాంగ్రెస్ శ్రేణులు గురువారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలేరు పీఏసీఎస్ చైర్మన్ జనగామ ఉపేందర్‌రెడ్డి, ఆలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంధమల్ల అశోక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సీఈసీ వ్యవహారాలను సమర్థించడం సిగ్గుచేటని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.



ధర్నాలో మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, కౌన్సిలర్లు పస్థం ఆంజనేయులు, మల్లెల సరిత శ్రీకాంత్, జట్ట నీరజ సిద్ధులు, కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్, షరాజీపేట సర్పంచ్ కంతి మధు, నాయకులు సందుల సురేష్, దూసరి మురళి, ఆలేరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కే.సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేకల రాములు ఆశయాల సాధనకు పోరాటం కొనసాగాలి

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 ( వార్త వేదిక సూర్య):

కార్మిక వర్గ ప్రయోజనాలే లక్ష్యంగా విప్లవకర కార్మికోద్యమంలో పాల్గొన్న కామ్రేడ్ మేకల రాములు చివరి వరకు కార్మికుల సంక్షేమం కోసం పోరాడారని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి బెజాడి కుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెంలో గురువారం ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు, అమరుడు కామ్రేడ్ మేకల రాములు పదో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా రాములు స్మారక స్థూపం వద్ద అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకుడు మేకల వెంకటేష్ ఎర్ర జెండాను ఎగురవేశారు. అనంతరం రాములు చిత్రపటానికి పూల మాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో భిక్షపతి, బెజాడి కుమార్ మాట్లాడుతూ.. కటిక పేదరికంలో జీవించినప్పటికీ మనిషిని మనిషి దోపిడీ చేసే విధానాన్ని మేకల రాములు తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. అసమానతలు, అసౌకర్యాలతో జీవిస్తున్న కార్మికులు, కష్టజీవులు మెరుగైన జీవితం గడపాలని, సగర్వంగా తలెత్తుకుని జీవించే నూతన సమాజ నిర్మాణం కోసం సాగిన పోరాటంలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారని అన్నారు.




సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ధర్మారెడ్డిగూడెం సర్పంచ్ కొల్లూరి రాజయ్య మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలను విమర్శించారు. తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను వెంటనే ఓటరు జాబితాలో చేర్చాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్ధన్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్. సీత, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు బర్మ బాబు, మేకల రాములు కుమారులు మేకల కరుణాకర్, మేకల క్రాంతికుమార్, సీనియర్ నాయకుడు అన్‌రెడ్డి బాల్‌రెడ్డి, ప్రజా సంఘాల జిల్లా, డివిజన్ నాయకులు చిరబోయిన కొమురయ్య, ఎలగందుల సిద్దులు, ఏనుగుల ఎల్లయ్య, కొంగరి సాయిరామ్, పాకాల సరిత, గడ్డం యాదగిరి, వంగాల మధుసూదన్‌రెడ్డి, పాకాల నరేష్, సుంచు రాములు, తాడేం పాండు, కోండ్ర శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత సమాజ నిర్మాణానికి 'జోష్ టీమ్స్'

### - జిల్లాలో 46 గ్రామ పంచాయతీలకు టీబీ రహిత గ్రామాలుగా గుర్తింపు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

దేశవ్యాప్తంగా టీబీ (క్షయ) రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపం నుంచి 'జోష్' (జోష్ – జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ ) టీమ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. మనోహర్, ముఖ్య అతిథులుగా జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్ టి. శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ చైర్మన్ ఒవైసీ చిస్థి పాల్గొని 'జోష్ టీమ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, యువజనులు క్షయ రహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. టీబీ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, లక్షణాలు ఉన్నవారిని సకాలంలో పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి పూర్తిస్థాయి చికిత్స అందేలా సహకరించాలని ప్రతిజ్ఞ చేశారు. టీబీకి సంబంధించిన పరీక్షలు, చికిత్సలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వ్యాధి నిర్ధారణైన వారికి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి నెలా రూ.1,000 పోషణ భత్యం అందుతుందని ప్రజలకు విస్తృతంగా తెలియజేస్తామని పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. మనోహర్ మాట్లాడుతూ టీబీ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో టీబీ లక్షణాలపై అవగాహన కల్పించి ముందస్తుగా వ్యాధిని గుర్తించేలా చర్యలు చేపట్టాలన్నారు. టీబీ బాధితుల పట్ల వివక్ష, సామాజిక కళంకాన్ని తొలగించి వారికి మానసిక, సామాజిక మద్దతు అందించాలని సూచించారు. టీబీ బాధితులకు పోషకాహార భరోసా కల్పించేందుకు 'ని–క్షయ్ పోషణ్ యోజన'తో పాటు దాతల సహకారంతో 'ని–క్షయ్ మిత్ర' కార్యక్రమం ద్వారా అదనపు పౌష్టికాహార కిట్లను అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. "టీబీ ఓడిపోతుంది–దేశం గెలుస్తుంది"అనే సంకల్పంతో సమష్టిగా పనిచేసి క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు.




### జిల్లాలో 46 టీబీ రహిత గ్రామాలు

జిల్లాలోని మొత్తం 427 గ్రామ పంచాయతీల్లో 46 గ్రామ పంచాయతీలను టీబీ రహిత గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. ఆయా గ్రామ పంచాయతీల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. టీబీ నిర్మూలనలో గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ప్రజలు అందిస్తున్న సహకారాన్ని అధికారులు అభినందించారు. ఎన్‌సీసీ కోఆర్డినేటర్ ప్రసాద్, నవభారత్ యూత్ అసోసియేషన్ చైర్మన్ కరణ్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుమన్ కళ్యాణ్, టీబీ విజేతలు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌సీసీ విద్యార్థులు, మై భారత్ వాలంటీర్లు, యువజన సంఘాల ప్రతినిధులు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ సేవలు ఇక ఆన్‌లైన్‌లోనే

### - DRA సిబ్బందికి కొత్త వెబ్‌సైట్‌పై ఓరియంటేషన్ శిక్షణ

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్–2010కు సంబంధించిన సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు కొత్త ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు యాదాద్రి భువనగిరి, జనగాం జిల్లాల జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (DRA) సిబ్బందికి కొత్త వెబ్‌సైట్ వినియోగంపై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (DM&HO) కార్యాలయంలో మధ్యాహ్నం 1.30 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి CEA–2010 జాయింట్ డైరెక్టర్ డా. వెంకటరమణ అధ్యక్షత వహించారు. ASO శ్రీమతి మౌనిక DRA సిబ్బందికి కొత్త వెబ్‌సైట్ వినియోగం, ఆన్‌లైన్ విధానాలపై శిక్షణ అందించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌కు సంబంధించిన దరఖాస్తులను ఇకపై ఆన్‌లైన్‌లోనే స్వీకరించాలని డా. వెంకటరమణ సూచించారు. దరఖాస్తుల పరిశీలన, తనిఖీ ప్రక్రియ, ఇన్‌స్పెక్షన్ నివేదికల నమోదు, సర్టిఫికెట్ల జారీ తదితర అన్ని ప్రక్రియలను వెబ్‌సైట్ ద్వారానే నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్, సవరణలు, తనిఖీలు, సర్టిఫికెట్ల జారీ వంటి సేవలను ఆన్‌లైన్‌లో నిర్వహించడం ద్వారా ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని తెలిపారు. CEA–2010కు సంబంధించిన అన్ని కార్యకలాపాలను నిర్దేశిత విధానాల ప్రకారం ఆన్‌లైన్‌లో నిర్వహించడంతో పాటు రికార్డులు, నెలవారీ నివేదికలను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు, DRA సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా DM&HO డా. ఎం. మనోహర్, జనగాం జిల్లా DM&HO డా. వి. వాణిశ్రీ, DCEA సెల్ నోడల్ అధికారి డా. ఎం. సుమన్ కళ్యాణ్, డిప్యూటీ డెమో శ్రీమతి వై. పద్మ, జనగాం ఇన్‌చార్జి డిప్యూటీ డెమో శ్రీ జైపాల్ రెడ్డి, రెండు జిల్లాల DRA సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల భద్రతే పోలీసుల ప్రాధాన్యం

**ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి**

**రద్దీ నియంత్రణకు ముందస్తు ప్రయాణ ప్రణాళికలు అవసరం**

**బీబీనగర్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద పోలీసుల పర్యవేక్షణ**

**యాదాద్రి భువనగిరి ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి జిల్లా (వార్తా వేదిక సూర్య):

దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పండుగల వేళ ప్రజలు తమ సొంత ఊర్లకు వెళ్లే క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణాలను ఒకటి, రెండు రోజుల ముందుగానే ప్లాన్ చేసుకోవాలని ఆయన సూచించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు.

**నిరంతర పర్యవేక్షణ..**

జాతీయ రహదారులపై పండుగ రద్దీని నియంత్రించేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా బీబీనగర్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద తగినంత మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. వాహనదారులకు డీఎస్పీ సూచనలు: ★అప్రమత్తత:★ జాతీయ రహదారిపై నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి. ★ప్రమాదకర డ్రైవింగ్ వద్దు:★ అతివేగంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రాంగ్ రూట్ డ్రైవింగ్, ప్రమాదకరమైన రీతిలో ఓవర్ టేకింగ్ చేయకూడదని హెచ్చరించారు. ★భద్రతా నియమాలు:★ ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు విధిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని స్పష్టం చేశారు. ★డ్రంక్ అండ్ డ్రైవ్:★ మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని, ఆనందంగా పండుగ జరుపుకోవాలని డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రక్షణ సేన జిల్లా కమిటీలో నూతన బాధ్యతలు

**యువజన, విద్యార్థి, బీసీ, మహిళా, సోషల్ మీడియా విభాగాలకు అధ్యక్షుల నియామకం**



భువనగిరి టౌన్, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రక్షణ సేన యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీలోని వివిధ విభాగాలకు నూతన బాధ్యతలను అప్పగించారు. జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్ రావు ఆధ్వర్యంలో, కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. నూతనంగా నియమితులైన వారిలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఆకుల నరేష్ యాదవ్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా మందువ మహేష్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా చిన్నాం ప్రభాకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బండారి నవనీత, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా పందు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్ రావుతో పాటు సీనియర్ నాయకులు నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నూతన అధ్యక్షులు త్వరలో గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుని సంస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని, ప్రభుత్వంపై ప్రజా సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తంగలపల్లి శ్రీకాంత్, మంచాల సంతోష్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం

**చలో లోక్ భవన్‌లో ఎమ్మెల్యే కుంభం**

**CEC జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి డిమాండ్**

**'సేవ్ డెమోక్రసీ' నినాదంతో భువనగిరి కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన**




హైదరాబాద్, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య)

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన 'సేవ్ డెమోక్రసీ – చలో లోక్ భవన్' కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్ భవన్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో భువనగిరి నియోజకవర్గానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్, కోఆప్షన్ సభ్యులు కౌసర్, నాయకులు ఈరపాక నర్సింహా, బట్టు ప్రేమ్ కుమార్, సర్పంచ్ రమేష్ నాయక్, సురూపంగా చందు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్

**- చలో లోక్‌భవన్‌లో ఎమ్మెల్యే కుంభం**

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):



కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ డెమోక్రసీ– చలో లోక్‌భవన్' భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం ఇండియా కూటమి చేపట్టిన ఈ నిరసనలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో వివక్షకు తావివ్వొద్దు

**- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయాలి**
**- బీఆర్ఎస్ సర్పంచులు**



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో రాజకీయ పక్షపాతానికి తావులేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ సర్పంచులు డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి కలెక్టరేట్ ఎదుట భువనగిరి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ నిరసనలో సర్పంచులు ప్రభుత్వ విధానాలపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన పేద కుటుంబాలను రాజకీయాలకు అతీతంగా గ్రామసభల ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయాలని వారు కోరారు. అర్హత ఉన్నప్పటికీ అన్యాయానికి గురైన కుటుంబాలను గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులపై జరుగుతున్న వేధింపులు, వివక్షను వెంటనే నిలిపివేయాలని కోరారు. గ్రామాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలను సర్పంచుల ఆధ్వర్యంలో పారదర్శకంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామస్థాయిలో సర్పంచుల పాత్రను విస్మరించవద్దని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో వలిగొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు పనుమటి మమత నరేందర్‌రెడ్డి, తొక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, నీల శిరీష ఓంప్రకాష్, అతికం అరుణ లక్ష్మీనారాయణగౌడ్, ర్యాకల సంతోష శ్రీనివాస్, కటికే జంగయ్య యాదవ్, మనోర్ నర్సింహ, నాగెల్లి గిరిజ రమేష్‌గౌడ్, గాదె యశోద, తోటకూర శంకరయ్య, సునీత, శ్రీకాంత్, కంకల కిష్టయ్య, శివ, నాకోటి నగేష్, రాజు, పాండు నాయక్, సామ రవీందర్‌రెడ్డి, బోడిగె లింగాస్వామి, తరిమి లలిత, మద్యాల మంజుల సందీప్, తిరుమలేష్, ఆవుల నర్సింహ, లావణ్య గణేష్, బాలకృష్ణ, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ఎస్‌లో ఉద్యోగాలు కల్పించాలి

**రిలే నిరాహార దీక్షలకు అనుమతించాలని అధికారులకు వినతి**



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్ఎస్)లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనువోజు వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గురువారం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఉద్యమ కళాకారులు కీలకంగా పనిచేశారని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఉద్యమ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ కళాకారుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్, జిల్లా అధ్యక్షుడు వేముల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి గంధం మల్ల శివశంకర్, గౌరవాధ్యక్షుడు కోట భిక్షపతి, ఉపాధ్యక్షుడు బంటు తిరుమలేష్, కోశాధికారి మల్లం వెంకటేష్, ప్రచార కార్యదర్శి సురుపంగ గణేష్, సంయుక్త కార్యదర్శి తాటిపాముల లింగస్వామి, బుగ్గ జ్యోతి, పల్లెర్ల కుమారి, గణేష్, శ్రీనివాస్, కిషన్, బాలమణి, పుష్ప, మహేష్, జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**13న సమ్మెకు నోటీసు..**
**ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్**



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 13న చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును గురువారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగ నాయకులు తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఇమ్రాన్ కోరారు. ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా టీఎన్‌జీవో నాయకులు వెంకట్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎండీ జమాల్, ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డాక్టర్ షాహిద్ అలీ, నెహ్రూ, నర్సింహా, శ్రీనివాస్, మురళి, వినోద్, లావణ్య, గీత, భవాని, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 'బ్లాక్ డే' నిరసన

యాదాద్రి భువనగిరి , అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):

ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు సంబంధించిన అంశాలపై సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో 'బ్లాక్ డే' నిరసన నిర్వహించారు. యాదగిరిగుట్టలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల పారదర్శకతకు సంబంధించిన అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.




## బిర్లా పౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం



తుర్కపల్లి 8(వార్త వేదిక సూర్య)

ఈరోజు తుర్కపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో ఎడవల్లి రమేష్ మరియు రోడ్ యాక్సిడెంట్లో ఆకుల భాస్కర్ ఇద్దరు యువకులు మరణించడం జరిగింది . వీరికి గౌరవ ఆలేరు శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్పు బీర్ల ఐలన్న గారి ఆదేశాల మేరకు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత గారి సహకారంతో ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం గ్రామ శాఖ అధ్యక్షుడు కోట జహంగీర్ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ సోమల వెంకటేష్ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు కోట సురేష్ మరియు ప్రధాన కార్యదర్శి బొల్లారం జగదీష్ సహక కార్యదర్శి బండారి శ్రీను వాడు సభ్యులు కోట జాన్సన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి యాదగిరి కూరెళ్ళ బాలకృష్ణ మరియు మహిపాల్ పాల్గొనడం జరిగింది.

## రైతు గళం బీఆర్ఎస్ పోరాటం!



తుర్కపల్లి 8(వార్త వేదిక సూర్య)

తుర్కపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ముందు మహా ధర్నా విజయవంతం తూర్కపల్లి మండలంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన విద్యుత్ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు 33/11 కెవి సబ్‌స్టేషన్ ముందు భారీ ధర్నా మరియు ముట్టడి కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి గారు అధ్యక్షత వహించగా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల తూర్కపల్లి మండల రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం రోజుకు అనేక గంటల పాటు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ రైతులను నష్టాల్లోకి నెట్టేస్తోందని విమర్శించారు. లో వోల్టేజ్ సమస్యల కారణంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్య వైఖరి కారణంగా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు తరలివచ్చి ధర్నాలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహా ధర్నాతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు, ముఖ్యంగా DE గారు, తూర్కపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు కచ్చితంగా 12 గంటల విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అని, రైతాంగం మరియు సామాన్య ప్రజల హక్కుల కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నివాసంపై దాడిని తీవ్రంగా ఖండించండి

**రామన్నపేట కోర్టు ఆవరణలో నిరసన**

**మామిడి వెంకటరెడ్డి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు**



రామన్నపేట, ఆగస్టు 8 (వార్తా వేదిక సూర్య)

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (AILU) జాతీయ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్య గారి కోల్‌కతాలోని నివాసంపై ఈరోజు తెల్లవారుజామున దుండగులు దాడి చేసి, కిటికీ అద్దాలను పగులగొట్టి, సీసీటీవీ కెమెరాను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ రామన్నపేటలో న్యాయవాదులను నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది అనంతరం మామిడి వెంకటరెడ్డి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) నిరంకుశ చర్యలకు, SIR ప్రక్రియకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న భట్టాచార్యను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఈ దాడి జరిగిందని అన్నారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దుండగుల ఈ చర్యను ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిని, ప్రేరేపించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పశ్చిమ బెంగాల్‌లోని వివిధ కోర్టుల వద్ద న్యాయవాదులపై జరుగుతున్న వరుస దాడులు న్యాయవాద వృత్తి స్వాతంత్ర్యానికి, ప్రజాస్వామ్య హక్కులకు తీవ్ర ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేసింది. దాడులపై నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని, న్యాయవాదులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఐలు కమిటీలు, న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, ఎండి ఖయ్యూం, గడ్డం నరసింహ, రమేష్, తాటిపాముల కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేయాలి

**- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**- టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించాలి**

**- టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు సర్టిఫికెట్ల పంపిణీ**

**పెద్దపల్లి, అక్టోబర్-08: ( వార్త వేదిక సూర్య )**

టీబీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేస్తూ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు అదనపు కలెక్టర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీబీ వ్యాధి నియంత్రణ, అనుమానిత కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించేలా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.

రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. టీబీ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స టీబీ నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు సకాలంలో అందేలా చూడాలని





అదనపు కలెక్టర్ సూచించారు. రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో మందులు వినియోగించేలా ఆరోగ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స పూర్తయ్యే వరకు వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

**80 గ్రామాలను టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక చేయడం అభినందనీయం**

టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 80 గ్రామాలు టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక కావడం అభినందనీయమని అదనపు కలెక్టర్ అన్నారు. టీబీ నిర్మూలనపై విస్తృత అవగాహన టీబీ వ్యాధి నివారణ, లక్షణాలు, చికిత్స, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన గ్రామాల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో కూడా కొత్త కేసులను ముందుగానే గుర్తించడం, చికిత్స అందించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం వంటి చర్యలను నిరంతరం కొనసాగించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వై. పవిత్ర, జిల్లా టీబీ నియంత్రణ విభాగం అధికారి కె. వి.సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రాజగోపాల్ , వైద్య సిబ్బంది, వివిధ మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, టీబీ రహిత గ్రామాల సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# చామనపల్లి గ్రామ పునరావాసానికి భూసేకరణ ప్రక్రియ చేపడతాం

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, అక్టోబర్ 08, (వార్త వేదిక సూర్య) :**



చామనపల్లి గ్రామ పునరావాసానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ధర్మారం మండలం చామనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు మరియు శ్రీ శ్రీనివాస రావు గుప్త చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్ ) రామగుండం ల తో కలిసి జిల్లా కలెక్టర్ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి, గ్రామ పునరావాసం, భూసేకరణకు సంబంధించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా కాలినడకన పర్యటించి పలు ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల సమయంలో గ్రామం ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అనేక మంది గ్రామస్థులు తమకు వినతులు సమర్పించారని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని చామనపల్లి గ్రామంలో భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మేడారం రిజర్వాయర్ ఎఫ్‌ఆర్‌ఎల్‌కు సంబంధించి 100 మీటర్ల పరిధి వరకు అవసరమైన తరలింపు ప్రక్రియను తక్షణమే చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. అయితే మొత్తం గ్రామాన్ని పునరావాసం చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ద్వారా అందిన ప్రజల వినతుల మేరకు చామనపల్లి గ్రామంలో భూసేకరణ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, గ్రామస్థుల నుంచి అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం తనను పంపినట్లు చెప్పారు. గ్రామంలో సుమారు 140 ఇళ్లు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందని కమిషనర్ తెలిపారు. గ్రామంలోని పాఠశాల, మహిళా సమాఖ్య భవనం వంటి నిర్మాణాలను ఇప్పటికే ఎత్తైన ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం అవి ముంపునకు గురికావడం లేదని పేర్కొన్నారు. పునరావాస కాలనీని అభివృద్ధి చేసి అర్హులైన వారికి ఇంటి స్థలాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి వ్యక్తికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. ముంపు కారణంగా జీవనోపాధిని కోల్పోయే వారికి కూడా నిబంధనల మేరకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థుల అభిప్రాయాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య, ఇరిగేషన్ అధికారులు,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మున్సిపల్ భవనం నిర్మాణ పనులను పరిశీలన

**మంథని, అక్టోబర్ 8, (వార్త వేదిక సూర్య )**

మంథని మున్సిపాలిటీ నిర్మాణంలో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయ పనులను మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ , పాలక వర్గ సభ్యులు సంపత్ రావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ , నరసింహ స్వామి డిప్యూటీ ఇంజనీర్, మనోహర్ మున్సిపల్ కమిషనర్ , మౌనిక అసిస్టెంట్ ఇంజనీర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, నూతన మంథని మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, అతి త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంథని పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చైర్మన్ తెలిపారు. నూతన మున్సిపల్ కార్యాలయంతో పాటు 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 90 అడుగుల రోడ్డు విస్తరణ వంటి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ల అభివృద్ధి, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులను కూడా ప్రారంభించ నున్నట్లు తెలిపారు.

మంథని పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఒక సంవత్సరం లోపు ప్రధాన అభివృద్ధి పనులను పూర్తి చేసి మంథనిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో



మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి , పాలక వర్గ సభ్యులు కుర్ర లింగయ్య, పెంటరి రాజు,నాయకులు లైశెట్టి రాజు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు చేస్తే చూస్తూ ఊరుకోము

**- బీఆర్ఎస్ నాయకులు హెచ్చరిక**



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**

నాగర్ కర్నూల్ జిల్లాలో అక్రమ అరెస్టులకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని భిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ భిఆర్ఎస్ మాజీ జెడ్పిటిసి శ్రీశైలం ను అరెస్టు చేయడం సిగ్గుచేటని ఉద్దేశపూర్వకంగానే మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అధికారం ఉందని అహంకారంతో తనకు అడ్డుగా మాట్లాడుతున్న వారిపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వ్యవహరిస్తున్న తీరుపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు, నీచ రాజకీయాలకు తావివ్వడం తగదని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులు, బెదిరింపులతో తమ గొంతును అణచివేయలేరని స్పష్టం చేశారు. ప్రజల తరఫున ప్రశ్నించే వారిపై ఒత్తిళ్లు తీసుకురావడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నాగయ్య, రైతుబంధు మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ తిమ్మాజిపేట పాండు,గంగాధర్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు సంపూర్ణ మద్దతు

**- బహుజన స్టూడెంట్ ఫెడరేషన్**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**



నాగర్ కర్నూల్ జిల్లా బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ మాట్లాడుతూ అక్టోబర్ 9 శుక్రవారం నాడు మాన్యవర్ కాన్షిరామ్ గారి 20వ వర్ధంతి సందర్భంగా హలో బహుజన చలో బడంగ్ పెట్‌బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించే సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్ లోని బడంగ్ పేట్ లో నిర్వహించే బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు నలుమూలల నుంచి విచ్చేయుచున్న బహుజన సైనికులకు ఆహ్వానం పలుకుతూ ఈ సభకు ఎంతోమంది కవులు, కళాకారులు, మేధావులు,వివిధ హోదాల్లో పనిచేస్తున్న ప్రజా సంఘాల నాయకులు,నిరుద్యోగులు, హాజరవుతున్నారు. కాబట్టి ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై ప్రతి నియోజకవర్గం నుంచి నుంచి పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పిలుపునిచ్చారు.

# ఎస్టేట్ అధికారి ఐలయ్యపై విచారణ చేపట్టాలి

**- అధికార పార్టీ నాయకుని అండతో విచ్చలవిడిగా అవినీతి**

**- ఆధారాలన్నీ జీఎంకు పంపిస్తున్నాము చర్యలు చేపట్టాలి**

**- బీఆరెఎస్ మండలాధ్యక్షుడు శెంకేషి రవీందర్**

**మంథని, అక్టోబర్ -08: ( వార్త వేదిక సూర్య )**

మంథని నియోజకవర్గం లోని రామగిరి సింగరేణి ఆస్తులు అన్యాక్రాంతానికి బాధ్యుడైన అర్జీ-3 ఎస్టేట్ అధికారి ఐలయ్యపై విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని బీఆరెస్ మండల పార్టీ అధ్యక్షుడు శెంకేషి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం సెంటినరీ కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక అధికార పార్టీ నాయకుని అండతో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నాడని ఆయన ఆరోపించారు. ఒకవైపు సంస్థ భూములు కబ్జాకు గురవుతుంటే సంరక్షించాల్సిన అధికారి తనకు సంబంధం లేదన్నట్టుగా బాధ్యతరాహిత్యంగా మాట్లాడుతున్నా జీఎం ఆయనకు వత్తాసు పలకడం సబబు కాదన్నారు. పాత పీనల్ రెంట్ రిసిప్ట్ లను అడ్డం పెట్టుకుని కొత్తగా టేలాలు వేయిస్తున్నారని, తమ వద్ద ఆధారాలున్నట్లు తెలిపారు.

ఆరోపణలు ఎదురుకుంటున్న అధికారి తన నిజాయితీని నిరూపించుకోవాల్సింది పోయి తమ నాయకుని పేరు తీయడం చూస్తుంటే ఆయనకు అధికార పార్టీకి ఉన్న సంబంధాలు బట్టబయలవుతున్నాయని తెలిపారు. తమవద్ద ఉన్న ఆధారాలను జీఎం, విజిలెన్స్ తో పాటు డైరెక్టర్ పా, సీ అండ్ ఎండీకి మెయిల్ చేస్తున్నామని తక్షణం విచారణ జరిపి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐలయ్య బాధ్యతలు చేపట్టినప్పటి నుండి కొత్తగా ఎన్ని నిర్మాణాలు జరిగాయి, ఎన్ని టేలాలు వేశారు, వకీల్ పల్లి చర్చి పక్క భూమి కబ్జాకు కారకులెవరు అని కూలంకశంకంగా విచారణ జరపడంతో పాటు పాత




పీనల్ రెంట్ రిసిప్ట్ లను ఎవరికి బదలాయించారు అనే విషయంపై దృష్టి పెట్టి బాధ్యుడైన ఐలయ్యపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జీఎం మధుసూదన్ గుడ్డిగా ఐలయ్యకు వంతపాడటం మానుకోవాలని సంస్థ ఆస్తుల పరిరక్షణలో జరిగిన అవినీతికి బాధ్యత వహించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ పూదరి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, నాయకులు దామెర శ్రీనివాస్, బొంకూరి పోశం, కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్,నక్కలగండి రిజర్వాయర్ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన కలెక్టర్, ఎమ్మెల్యే

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్, నక్కలగండి రిజర్వాయర్ పనులను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మన్నెవారిపల్లి సమీపంలోని ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నక్కలగండి రిజర్వాయర్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రాజెక్టు నిర్మాణ పురోగతి, ముంపు ప్రాంతాలు, భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, పరిహారం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నక్కలగండి రిజర్వాయర్ ముంపు పరిధిలోని మర్ల పాడు తండా, కేశతాండలోని రీ-లోకేటెడ్ (=ఢ=) స్థలాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ పరిశీలించారు. పునరావాస ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముంపునకు గురవుతున్న మర్లపాడు తండా గ్రామస్తులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పునరావాసం, పరిహారం, భూములు, మౌలిక వసతులు తదితర అంశాలపై గ్రామస్తులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ నక్కలగండి రిజర్వాయర్ ముంపు ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ముంపు బాధితుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పునరావాస ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న కుటుంబాల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారంతో పాటు, వారి భవిష్యత్ జీవనానికి ఉపయోగపడే విధంగా మెరుగైన



పునరావాస సౌకర్యాలు కల్పించేలా చర్యలు ప్రభుత్వం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్, నక్కలగండి రిజర్వాయర్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనులు ముందుకు సాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత రైతాంగానికి, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 141 || శుక్రవారం అక్టోబర్ 9, 2026 ||

# చలో లోక్ భవన్ ర్యాలీలో మంత్రి శ్రీధర్ బాబు

**పెద్దపల్లి, అక్టోబర్ 08, ( వార్త వేదిక సూర్య )**



కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్ తో ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమోక్రసీ' పిలుపులో భాగంగా గురువారం టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో లోక్ భవన్' నిరసన ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర ఐటీ పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు.రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి బీజేపీ కి అనుకూలంగా వ్యవహరిస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించే వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పోరాటం ఆగదు అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# షాద్‌నగర్‌లో క్రీడా టోర్నమెంట్ ప్రారంభం

**- క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**

యువత క్రీడల్లో రాణించడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. షాద్‌నగర్ మినీ స్టేడియంలో స్థానిక క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అన్నారు. యువత





చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతోందని, భవిష్యత్‌లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. యువ క్రీడాకారులు ఇప్పటి నుంచే తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు.టోర్నమెంట్ విజేతకు రూ.70 వేల నగదు, రన్నరప్‌కు రూ.30 వేల నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడా క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# భౌతిక శాస్త్ర ప్రతిభకు పురస్కారాలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**

బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎం.ఆర్.వి. ప్రసాద్-- ఎం.ఏ. భవాని మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.1,000 చొప్పున నగదు బహుమతులు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి రూ.3,000తో పాటు గోల్డ్ మెడల్ అందజేశారు. ముఖ్య అతిథి లీలా మోహన్‌రావు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య మాట్లాడుతూ ఇలాంటి పురస్కారాలు విద్యార్థుల్లో పోటీతత్వం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్,ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**సిద్దాపూర్ గ్రామ శివారులో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థల పరిశీలన**



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని సిద్దాపూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రాతో కలిసి పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ సకాలంలో భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయంపై అధికారులు ఆరా తీశారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, భోజన ఏర్పాట్లు, పాఠశాలలో అమలవుతున్న నిర్వహణ విధానాల గురించి సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండటం వారి ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో ముఖ్యమని ఈ తనిఖీ ప్రాధాన్యతను తెలియజేసింది. పాఠశాలకు కొంతమంది విద్యార్థులు తరచుగా గైర్హాజరవుతున్నట్లు గుర్తించిన అధికారులు, అందుకు గల కారణాలను సంబంధిత ఉపాధ్యాయులతో పాటు తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలను గుర్తించడం ద్వారా వారి చదువుకు ఆటంకం కలగకుండా చూడాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువులో రాణించేలా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాల్సిన ప్రాధాన్యతను గుర్తించారు.

# మున్ననూరులో పాడి పశువులకు వైద్య పరీక్షలు

**- గర్భకోశ వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన..**

**38 పశువులకు చికిత్స..**

**మిడ్జిల్, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**

పాడి పశువుల్లో గర్భకోశ సంబంధిత వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారించడంతో పాటు పశు పోషకులకు అవగాహన కల్పించేందుకు మున్ననూరు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్య పశుసంవర్ధక శాఖ, తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు.శిబిరంలో మొత్తం 38 పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు. అదేవిధంగా 15 దూడలకు నట్టల నివారణ మందులను అందించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, గర్భకోశ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సకాలంలో వైద్య పరీక్షల ప్రాధాన్యతపై పాడి రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్, గ్రామ సర్పంచ్ సుజాత మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్ శ్రావణి, ఉపసర్పంచ్ రాణిబాయి, గ్రామ పెద్దలు నర్సిరెడ్డి, మల్లయ్య గౌడ్, రామస్వామి, ప్రహ్లాద్ రెడ్డి, యాదయ్య, పశువైద్య సిబ్బంది సత్యం, జేవీవో దామోదర్, వీఎల్వో సత్యం, ఓఎస్, గోపాలమిత్రలు యాదగిరి, నరసింహ, వేణుగోపాల్, రామకృష్ణతో పాటు పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.



# ఎంవీఎస్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మేయర్ గుమ్మల మమత**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**

మహబూబ్‌నగర్ నగరంలోని ఎంవీఎస్ కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్ సరిత తిరుపతయ్య, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ సురేందర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు. మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. దీంతో కళాశాల ప్రాంగణం బతుకమ్మ పాటలు, కోలాటాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నగర ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు ముకుందం రమేష్, శివజోగి, అనుప శేఖర్, అవేజ్, ఎన్‌పీ నేహాశ్రీ, కృష్ణకాంత్‌రెడ్డి, సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.







# ఆర్టీసీ కార్మికుల ఐక్యతే మన బలం

**- కార్మికుల కృషితోనే ప్రజాపాలన విజయవంతం**

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**

ఆర్టీసీ కార్మికుల ఐక్యత, అంకితభావం ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్‌లోని కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలనలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో, ఈ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తూ తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తున్న కార్మికులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రకటించిన అనంతరం, ఆ బాధ్యతను స్వీకరించి విజయవంతంగా అమలు చేయడంలో ఆర్టీసీ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజాపాలన ముందుకు సాగడంలో కార్మికుల ఐక్యత, కృషి ముఖ్యమని పేర్కొన్నారు.

సమ్మేళనానికి తెలంగాణ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు తరలిరావడం వారి ఐక్యతకు నిదర్శనమని మిథున్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అశ్వత్థామరెడ్డి, గద్దర్, బొంతు రామ్మోహన్, రాజయ్య, కోదండరాం తదితర ప్రముఖులు పాల్గొన్నారు.కార్మికుల నుంచి లభిస్తున్న మద్దతును చూస్తే అశ్వత్థామరెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని మిథున్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తాతో పాటు పలువురు నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.







# రంగారెడ్డి

## రంగారెడ్డి జిల్లాలో ఘనంగా 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ -- జోష్'

**-ప్రారంభించిన అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మై**

**-టీబీ రహిత గ్రామాలకు ధ్రువపత్రాల పంపిణీ**

రాజేంద్రనగర్, అక్టోంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :



రంగారెడ్డి జిల్లా శివరాంపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ -- జోష్' (క్షయ రహిత భారత్ ప్రచారం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మై ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ?ఈ సందర్భంగా క్షయ రహితంగా గుర్తింపు పొందిన గ్రామాల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆయా గ్రామాల్లో క్షయ కేసులు ఏవీ లేవని నిర్ధారించిన అనంతరమే ఈ అవార్డులను అందించినట్లు అధికారులు స్పష్టం చేశారు.?అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రతి గ్రామం క్షయ రహితంగా మారేలా వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యాధి నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడేలా పర్యవేక్షించాలని సూచించారు.?ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాపారావు, జిల్లా కార్యక్రమ అధికారి శ్రీనివాస్, జిల్లా ప్రజారోగ్య కార్యక్రమ నిర్వాహకుడు విల్సన్, ప్రతినిధులు రహీం, మధుబాబు, మాధవిలతో పాటు పలువురు వైద్యులు, సర్పంచులు, పర్యవేక్షకులు, క్షయ వ్యాధి నుంచి కోలుకున్న బాధితులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల

సికింద్రాబాద్, అక్టోబర్ 08(వార్త వేదిక సూర్య)



సీతాఫలమండి అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. సామల హేమ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ఓటరుగా నమోదైన గ్రాడ్యుయేట్లు కూడా ప్రస్తుత ఎన్నికల కోసం మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.ఓటరు నమోదుకు డిగ్రీ లేదా సమాన విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, మార్కుల మెమో,ఆధార్ కార్డు, సాధారణ ఎన్నికల ఓటర్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో పత్రాలను తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లకు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్ డెస్క్ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని డా. సామల హేమ కోరారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గ సమన్వయకర్తలు రాజా సుందర్, రాజేందర్, బాలాజీ, అశ్విన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీలో అనుటెక్స్ లో సందడి చేసిన నిధి అగర్వాల్

**నిధి అగర్వాల్ చేతుల మీదుగా ప్రారంభం..ఆకట్టుకునే ప్రారంభ ఆఫర్లు.**

కూకట్ పల్లి, అక్టోబర్ 08 (వార్త వేదిక సూర్య) :



కుటుంబ ఫ్యాషన్ విభాగంలో విశ్వసనీయ బ్రాండ్‌గా పేరొందిన అనుటెక్స్ కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లో నూతన షోరూంను ఘనంగా ప్రారంభించింది. సినీ నటి నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. 1970లో ప్రారంభమైన అనుటెక్స్ ఐదు దశాబ్దాలకు పైగా నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలకు ప్రాధాన్యమిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతోంది. కుటుంబంలోని ప్రతి ఒక్కరి అవసరాలకు అనుగుణంగా సంప్రదాయ దుస్తులు, పండుగల కలెక్షన్స్, రోజువారీ వస్త్రాలు తదితర విభాగాల్లో విస్తృత శ్రేణి దుస్తులను అందుబాటులో ఉంచినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం అనుటెక్స్ కూకట్ పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీతో పాటు కొత్తపేట, అల్వాల్, మల్కాజిగిరి, ఉప్పల్, ఏఎస్ రావు నగర్, ఆర్‌సీ పురం, సుచిత్ర ప్రాంతాల్లో షోరూంలను నిర్వహిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

**ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లు**

**ఒక చీర కొనుగోలు చేస్తే అదే ధర గల మరో చీర కేవలం రూ.1కే**

**రూ.4,999 విలువైన కొనుగోలుపై ఉచిత వెండి నాణెం.**

**రూ.7,999 విలువైన కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం**

**రూ.1,499కు పైగా కొనుగోలుపై ఉచిత బహుమతులు.**

కస్టమర్ల నుంచి గత 56 ఏళ్లుగా అందుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన అనుటెక్స్ యాజమాన్యం, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లోని నూతన షోరూంను సందర్శించి ప్రారంభోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరింది. శ్రీనివాస్, నాగేష్, రాజశేఖర్ మాట్లాడుతూ అనుటెక్స్ మరింత విస్తరణ దిశగా ముందుకు సాగుతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

గొర్రెల మందల వద్దే ఉచిత వైద్య సేవలు అందించాలి

- పశువైద్యులు నేరుగా మందల వద్దకు వెళ్లాలి
- +వీూా జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు

ఆలేరు, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య): గొర్రెలు, మేకల పెంపకందారుల కోసం మందల వద్దే ఉచిత పశువైద్య సేవలు అందించాలని గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం (+వీూా) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆలేరు పశు వైద్యశాల ఎదుట +వీూా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దెపురం రాజు మాట్లాడుతూ శ్రీనివాసపురం గ్రామంలో గొర్రెలు, మేకలకు

## డిసెంబర్ 15 నుంచి సింగూర్, మంజీరా నీటి లభ్యత తగ్గే అవకాశం

**- ప్రజలు ఇప్పటి నుంచే 25 శాతం నీటి వినియోగాన్ని తగ్గించాలి: జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

రాజేంద్రనగర్, అక్టోంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :



రాష్ట్రంలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు, ది సిటిజన్స్ కౌన్సిల్ వ్యవస్థాపక చైర్మన్ సీతారాం ధూళిపాల సూచించారు.సీతారాం ధూళిపాల ఆధ్వర్యంలో తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు అంజనేయులు, ఆరిఫ్, బద్రీనాథ్, పాతూరి శ్రీనివాస్, బలరాం, సి.ఎస్.ఎన్. శర్మ, మహేష్, అజయ్, ప్రభాకర్ రెడ్డి, అనురాగ్ తదితరులు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, నీటి సంరక్షణ, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్రాల బలోపేతంపై చర్చించారు.రాష్ట్రంలో నీటి కొరత, వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాత పరిస్థితుల నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి సింగూర్, మంజీరా రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రజలు తమ సాధారణ నీటి వినియోగాన్ని కనీసం 25 శాతం తగ్గించి పొదుపుగా వినియోగించాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లతో తీవ్రమైన తాగునీటి కొరతను కొంతవరకు అధిగమించవచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని, లేనిపక్షంలో 'త్రాగు నీరు రామచంద్రా!' అంటూ నీటి కటకటను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నీటి సరఫరాలో ఉన్న అసమానతలను గుర్తించి సోర్స్, పైప్‌లైన్లు, నీటి ఒత్తిడి, బల్క్ కనెక్షన్లు, లీకేజీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి సమాన పంపిణీకి చర్యలు తీసుకోవాలని సీతారాం ధూళిపాల సూచించారు. సాధారణ వినియోగంతో పోలిస్తే కనీసం 20 శాతం నీటిని ఆదా చేసే కుటుంబాలు, సంస్థలు, అపార్ట్‌మెంట్లు, కాలనీలను ప్రోత్సహించేలా అవార్డు పథకాన్ని ప్రారంభించాలని కోరారు.తరచూ జరుగుతున్న మురుగునీటి పొంగిపొర్లే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత భూగర్భ మురుగునీటి వ్యవస్థ సామర్థ్యంపై సమగ్ర సాంకేతిక ఆడిట్ నిర్వహించాలని, అవసరమైన ప్రాంతాల్లో పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రోడ్ల నిర్మాణం, విస్తరణ సమయంలోనే వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను పెంచేలా రీచార్జ్ బోర్‌హోళ్లు, ఇతర రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

నిర్మాణంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, ఎత్తైన భవనాల నుంచి శుద్ధి చేయని మురుగునీరు బయటకు వెళ్లకుండా నియంత్రిత విడుదల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రజల నీటి భద్రత, నీటి సంరక్షణ, పట్టణ పారిశుద్ధ్యం మెరుగుదలకు జలమండలి నిర్మాణాత్మకంగా సహకరించేందుకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

గతంలో కొలతలు లేకుండా జారీ చేసిన నీటి బిల్లుల అంశంపై తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు కోసం వేచి చూడాల్సిందేనని సీతారాం ధూళిపాల పేర్కొన్నారు.

## జానపద వృత్తి కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి



**పిఎన్ఎమ్ రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ**

చౌటుప్పల్, అక్టోబర్ 8 వార్తా వేదిక సూర్య

కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అని పిఎన్ఎం రాష్ట్రకార్యదర్శి కట్ట నరసింహ అన్నారు. గురువారం రోజునా సిపిఎం చౌటుప్పల్ టౌన్ ఆఫీసుభవనంలోప్రజానాట్యమండలి జిల్లాస్థాయి క్యాడర్ క్లాసులు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గంటేపాక శివకుమార్ ప్రిన్సిపల్ గా వ్యవహరించగా, ఈ సందర్భంగా కట్ట నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కళాకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కళాకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నెలలు గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన విధంగా ఉన్నది వృత్తి కళాకారులకు 5వేల,రూపాయలు పింఛను ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల ఈ జిల్లాలో ఉన్నటువంటి జానపద వృత్తి కళాకారుల సమస్యల పరిష్కారంకై చలో కలెక్టరేట్ నిర్వహిస్తాం మని హెచ్చరించారు కళాకారులైనటువంటి చిందు,యక్షగానం, కోలాటం, బాగోతం, భజన కళాకారులకు, ప్రభుత్వం గుర్తించి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లేనియెడల జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ముందు కాలుకు గజ్జ కట్టి చేత డప్పు పట్టి భుజాన గొంగడి వేసి పాలకుల విధానాలను ఆటపాటల ద్వారా కళాకారులను సమీకరించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్య జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, పిఎన్ఎం రాష్ట్ర కోశాధికారి అవ్వరు గోవర్ధన్

పిఎన్ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటే పాక శ్రీకృష్ణ జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరసింహ, సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు వేముల జైలు రామన్నపేట మండలం అధ్యక్షులు బర్రె మధు నారాయణపురం మండల అధ్యక్ష కార్యదర్శులు బోయిన్ మల్లేష్ పిట్టగలయ్య ఎస్.కె మదర్ పబ్బతి పుల్లయ్య జిల్లా కమిటీ సభ్యురాలు వీర్లపల్లి నర్సమ్మ కమిటీ సభ్యులు గణేష్ సురేష్ బోల్లేపల్లి ప్రవీణ్ ఈర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో నవజాత శిశువు రోడ్డుపాలు..!

**పసికందును రోడ్డు పాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం...ఏసీపీ నరేష్ రెడ్డి.**





బాలానగర్, అక్టోబర్ 08 (వార్త వేదిక సూర్య) :

కని పెంచాల్సిన పేగు బంధమే తెగిపోయిందో.. లేక వెంటాడిన కఠిన పరిస్థితులే లొంగదీసుకున్నాయో గానీ, అప్పుడే కన్నుతెరిచిన నవజాత మగ శిశువును రోడ్డుపై పడేసిన అమానుష ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది.

**స్థానికుల అప్రమత్తత.. పునర్జన్మ పొందిన పసికందు**

బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాలానగర్ వైన్స్ సమీపంలో ఓ కండువాలో చుట్టి ఉన్న పసికందు రోదిస్తూ ఆ దారిన వెళ్తున్న కొందరు స్థానిక యువకులకు కనిపించింది. నిశ్శబ్ద వాతావరణంలో చిన్నారి ఏడుపు విని దగ్గరకు వెళ్లిన ఆ యువకులు, దృశ్యాన్ని చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వేళపాళ లేని వేళ, ఏమాత్రం కాలయాపన చేయకుండా వెంటనే బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు.

సకాలంలో వైద్యం.. ప్రాణాపాయం తప్పిన చిన్నారి

సమాచారం అందుకున్న వెంటనే బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, డీఐ సక్రమ్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు, శిశువును తక్షణమే బాలానగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నారికి అత్యవసర చికిత్స అందించి, నిరంతర పరిశీలనలో ఉంచారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందో లేదో వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

రంగంలోకి పోలీసులు.. సీసీటీవీల పరిశీలన

పోలీసుల సహకారంతో వైద్యులు శిశువుని అమీర్పేట్ లోని శిశు విహార కు తరలించారు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. బాలానగర్ ప్రధాన రహదారిలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శిశువును వదిలివెళ్లిన కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నవారు ఎవరు, ఈ నిర్దయ చర్యకు వెనుక ఉన్న కారణాలేమిటనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పసికందును రోడ్డుపాలు చేసిన బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ నరేష్ రెడ్డి స్పష్టం చేశారు.

## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల పత్రిక ఆవిష్కరణ

గట్టుప్పల.అక్టోబర్8.వార్త వేదిక సూర్య:



ఈ నెల 11నుంచి ప్రారంభమయ్యే దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గట్టుప్పల మండల కేంద్రంలో శివభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో గురువారం దేవస్థానం పాలకవర్గ సభ్యులు ఆహ్వాన కర పత్రికను ఆవిష్కరించారు. నవరాత్రోత్సవాలలో దుర్గామాత పూజలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుగానున్నాయని దేవస్థానం అధ్యక్షుడు అవ్వారి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ గౌరవాధ్యక్షులు జెల్ల షణ్ముఖి, అధ్యక్షులు అవ్వారి శ్రీనివాస్,సర్పంచ్ నామని జగన్నాథం,పురోహితులు శివానందం, పవన్ శర్మ,చేరుపల్లి చంద్రమౌళి, నామని వెంకటేశం, నామని బుచ్చయ్య, చేరుపల్లి సత్తయ్య,జెల్ల ఆంజయ్య, పూజారి చేరుపల్లి లక్ష్మయ్య,కర్నాటి ప్రభాకర్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 'చలో లోక్ భవన్'..

**కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.. కాంగ్రెస్ నాయకులు పట్వారి శశిధర్.**

కూకట్ పల్లి, అక్టోబర్ 08 (వార్త వేదిక సూర్య) :



ప్రజాస్వామ్య విలువలను, ఓటు హక్కును పరిరక్షించాలనే డిమాండ్‌తో నెక్లెస్ రోడ్ వద్ద నిర్వహించిన 'చలో లోక్ భవన్' కార్యక్రమంలో "తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్" మెట్టు సాయి కుమార్ తో కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, సర్ ప్రక్రియలో అవకతవకలను నిరసనగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలని, వారి ఓటు హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపరచకూడదని స్పష్టం చేశారు. ఓటు హక్కు రక్షణే ప్రజాస్వామ్య రక్షణ.. ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది" అనే నినాదంతో నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని పట్వారీ శశిధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, మహిళ నాయకులు, యూత్ కాంగ్రెస్, సేవాదళ్, యువకులు, కార్యకర్తలు టీం పట్వారీ, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి బాధ్యతల స్వీకరణ

రాజేంద్రనగర్, అక్టోంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :



వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కె. కళ్యాణ్ చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా క్షయ నివారణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కుష్ఠ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ పాపారావు, జిల్లా పరిపాలన అధికారి షఫీ, కార్యక్రమ అధికారి అక్రమ్, డాక్టర్ రాకేష్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళల ఐక్యత, సృజనాత్మకతకు ప్రాధాన్యత

**మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక**

సికింద్రాబాద్, అక్టోబర్ 08(వార్త వేదిక సూర్య)



మహిళల ఐక్యత, ప్రతిభ, సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారతను పెంపొందించే లక్ష్యంతో అగర్వాల్ సమాజ్ తెలంగాణ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ సంస్థ 5150వ అగ్రసేన్ జయంతి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోండా మార్కెట్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొననున్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, పరస్పర ఐక్యతను బలోపేతం చేయడం ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు.

## నార్సింగిలో అధికారులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమీక్ష

రాజేంద్రనగర్, అక్టోంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ నార్సింగి సర్కిల్--45 కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ (ఐఏఎస్)తో కలిసి నిర్వహించిన సమావేశంలో నార్సింగి పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులతో చర్చించారు. సమస్యలను గుర్తించి సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీసీ లక్ష్మారెడ్డి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మణికొండ డివిజన్‌లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజేంద్రనగర్, అక్టోంబర్, 08 ( వార్త వేదిక సూర్య ) :



మణికొండ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు.

ముఖ్యంగా నెమలి నగర్‌లోని జేఎన్‌యూఆర్ఎం కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టికి తీసుకురావడంతో, సమస్య పరిష్కారం కోసం నీటి మండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి అభ్యర్థన లేఖ అందజేశారు.

జేఎన్‌యూఆర్ఎం కాలనీలో ప్రస్తుతం 18 బ్లాకులు ఉండగా, ఒక్కో బ్లాక్‌లో 24 కుటుంబాల చొప్పున సుమారు 432 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతి బ్లాక్‌కు కేవలం ఒక నీటి కనెక్షన్ మాత్రమే ఉండటంతో నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడు తున్నాయని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రతి బ్లాక్‌కు అదనపు బల్క్ నీటి కనెక్షన్లు ఏర్పాటు చేసి నీటి సరఫరాను మెరుగుపరచాలని కోరారు.అదేవిధంగా జన చైతన్య కాలనీ వాసులు కూడా తమ తాగునీటి సమస్యలను నీటి మండలి మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో ప్రధాన నీటి పైప్‌లైన్ లేకపోవడంతో కొత్తగా నీటి కనెక్షన్లు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీంతో సుమారు 500 కుటుంబాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని వివరించారు.కాలనీలో ప్రధాన నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి, ప్రతి కుటుంబానికి నీటి కనెక్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అభ్యర్థన లేఖ అందజేశారు.ఈ సమస్యలపై నీటి మండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మణికొండ డివిజన్ పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు.

## పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

**రైతు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి**

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య )



పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ 11 వ డివిజన్ కతాల్‌గూడెంలో మహాసభల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ వర్షాలు సరిగా కురవక పంటలు ఎండిపోతున్న సమయంలో విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో దండెంపల్లి సరోజ, కన్నెకంటి సత్యనారాయణ, పనస చంద్రయ్య, పల్లె నగేష్, బొడిగ సూరయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 141
శుక్రవారం 09 అక్టోబర్ 2026

# ఓటు హక్కు పరిరక్షణ కోసం చలో లోక్ భవన్ నిరసన

### సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలి
### టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో

వార్తా వేదిక సూర్య ఎల్బీనగర్ అక్టోబర్



ఓటర్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలను నిరసిస్తూ, ప్రజల ఓటు హక్కును పరిరక్షించాలనే డిమాండ్‌తో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంత్రి .వాకటి శ్రీహరి మంత్రి .పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , దానం నాగేందర్ , మల్ రెడ్డి రామ్ రెడ్డి వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి పన్నాల జయపాల్ రెడ్డి, సహచర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్ భవన్ వరకు నిర్వహించిన చలో లోక్ భవన్ నిరసన కార్యక్రమంలో పాల్గొని.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉంది. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకమైన ప్రక్రియను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ అంశంపై సమాధానం చెప్పాల్సిన సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ , కాంగ్రెస్ అగ్రనేత శ్రీమతి ప్రియాంక గాంధీ , ఇండియా కూటమి ఎంపీల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరైన విధానం కాదని లోక్ భవన్ వద్ద నిరసన చేపట్టిన మమ్మల్ని పోలీసులు అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ప్రజల గొంతును అణచివేయలేరు. ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని. ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ పరిణామాలకు బాధ్యత వహించాలని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ప్రజల అసలైన బలం. ఆ ఓటు హక్కును కాపాడే వరకు మా పోరాటం కొనసాగుతుందని వారన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు మహిళలు యువత అభిమానులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

సంగారెడ్డి, వార్తా వేదిక సూర్య అక్టోబర్ 08:

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా నూతనంగా నియమితులైన సందీప్ కుమార్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు. వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేగంగా అందించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భేటీ



సంగారెడ్డి, వార్త వేదిక సూర్య ప్రతినిధి అక్టోబర్ 8 :

నియోజకవర్గంలోని పెండింగ్ అభివృద్ధి పనులు, రైతుల విద్యుత్ సమస్యలు, తాగునీటి సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలసి చర్చించారు. రైతులకు కనీసం 8 గంటల విద్యుత్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, కొరత ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర గ్రామాల్లో రూ.21.50 లక్షలతో బోర్‌వెల్స్ మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో అంబేద్కర్ భవనాల మంజూరు, పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో ధనపు కలెక్టర్ పాండు, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ జిల్లా డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డిని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి, అక్టోబరు 8 (వార్త వేదిక సూర్య):



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్ గా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డిని గురువారం చౌల్లరామారం బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజయ్య, సర్పంచ్ మందుల రేణుక కిరణ్, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజు, లింగయ్య, బాబు, విజయ్ కుమార్, చంటి, నర్సిరెడ్డి, శేఖర్ రెడ్డి, సత్తిరెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే బీఆర్ఎస్ ధర్నా - బాలమణి భాస్కర్

ఆలేరు, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):



ఆలేరు మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు నిర్వహించిన ధర్నా కేవలం రాజకీయ ఉనికి కోసమేనని మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ విమర్శించారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలేరు అభివృద్ధికి ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాము మున్సిపాలిటీలో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచుతామని తెలిపారు. "అధికారంలోకి వచ్చి ఐదు నెలల్లో మేమేం చేశామో చూపిస్తాం.. అభివృద్ధిని చూసేందుకు రండి" అని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. అభివృద్ధి పనులపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని బాలమణి భాస్కర్ అన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రెండో రోజూ జగ్గారెడ్డి దంపతుల దీక్ష

### - జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
### - దీక్షా శిబిరానికి వెల్లువెత్తిన సంఘీభావం

సంగారెడ్డి, వార్తా వేదిక సూర్య, అక్టోబర్ 8:




కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల జగ్గారెడ్డి చేపట్టిన సంఘీభావ దీక్ష రెండో రోజూ కొనసాగింది. సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొనసాగుతున్న దీక్షకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతులు, సంగారెడ్డి ప్రజలు తరలివచ్చి సంఘీభావం తెలిపారు.రాహుల్ గాంధీ పోరాటం కొనసాగినంతకాలం సంగారెడ్డిలో తమ దీక్ష కూడా కొనసాగుతుందని జగ్గారెడ్డి దంపతులు స్పష్టం చేశారు. దేశ ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థ, ఓటర్ల జాబితాలకు సంబంధించిన అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.

దీక్షకు పలువురి సంఘీభావం

జగ్గారెడ్డి దంపతుల దీక్షకు భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు.

రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న రోజుల్లోనూ సంఘీభావ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని జగ్గారెడ్డి తెలిపారు. దీక్షా శిబిరంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, జగ్గారెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రి విద్యా సంస్థలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



చౌటుప్పల్: అక్టోబర్ 8 వార్తా వేదిక సూర్య

శ్రీ గాయత్రి జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా, కన్నులపండుగగా జరిగాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, సాంప్రదాయ దుస్తులలో మెరిసిపోయిన విద్యార్థినులతో కళాశాల ప్రాంగణమంతా పండగ వాతావరణం సంతరించుకుంది.

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కరస్పాండంట్ శ్రీ బీమిడి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. "బతుకమ్మ పండుగ ప్రకృతిని, ఆడపడుచులను గౌరవించే గొప్ప పండుగ. చదువుతో పాటు మన సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకుంటూ ముందడుగు వేయాలి. ఇలాంటి వేడుకలు విద్యార్థులలో ఐక్యతను, మన మూలాల పట్ల గౌరవాన్ని పెంచుతాయి" అని పేర్కొన్నారు.

కళాశాల చైర్మన్ శ్రీ బండారు మయూర్ రెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను మన గాయత్రి కళాశాలలో ఇంత వైభవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని, విద్యార్థులు ఆధునిక విద్యను అభ్యసిస్తూనే, మన సంస్కృతీ సంప్రదాయాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

ఈ సంబరాలలో విద్యార్థినుల ఆటపాటలు, సాంప్రదాయ బతుకమ్మ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్కృతుల కలయికగా సాగిన దాండియా నృత్యాలు వేడుకల్లో సరికొత్త జోష్‌ను నింపాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ దయాకర్ గారు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు గారు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఎంపీ చామల వాయిస్ మార్ఫింగ్‌పై ఎస్పీకి ఫిర్యాదు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (వార్త వేదిక సూర్య):



భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి గొంతును ఏఐ సాంకేతికత ద్వారా మార్ఫింగ్ చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు చూపిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం స్థానిక ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 'డిగ్ టీవీ పారడి' పేరుతో ఉన్న చానెల్ ఈ మార్ఫింగ్ చేసిన వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పొత్నాక్ ప్రమోద్ కుమార్, పీసీసీ డెలిగేట్ మెంబర్ తంగేళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కదువ్వ సోమయ్య, బెండెలాల్ రాజ్, షఫీక్ అహ్మద్, కో–ఆప్షన్ సభ్యుడు పల్లెర్ల యాదగిరి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల బాలరాజ్, సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు సామల రవీందర్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అతహర్, రాము, మచ్చ రాజు యాదవ్, శరత్, నేహాల్ పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దు!

### :రాహుల్, ప్రియాంకల అరెస్టును ఖండిస్తూ చండూరులో కాంగ్రెస్ రాస్తారోకో

చండూరు, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):



కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు 'ఇండియా' కూటమి నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ చండూరు పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం భారీ రాస్తారోకో నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ దమనకాండ చర్యలను ఎంతమాత్రం సహించేది లేదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు కలిసి 'ఇండియా' కూటమి నేతల పోరాటాన్ని ఆపలేరని ధ్వజమెత్తారు. వీరి కనుసన్నల్లోనే కేంద్ర ఎన్నికల సంఘం అక్రమాలకు పాల్పడుతోందని, అక్రమాలకు సహకరిస్తున్న కేంద్ర ఎన్నికల అధికారి విఘ్నేశ్ కుమార్‌ను వెంటనే విధుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులు దాడికి పాల్పడటం అత్యంత దుర్మార్గమని, ఇది లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడితో సమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న భాజపాకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారి ఒక్క ఓటును తొలగించినా సహించేది లేదని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, జిల్లా నాయకుడు కాసాల జనార్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ కోడి సుష్మ వెంకన్న, మండల, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాళ్లు పందిరి రాధ, కారింగు పల్లవి, నాయకులు ఫరీఫ్, మొగుదాల వెంకన్న, కోఆప్షన్ ఖలీలు, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి సంగెపు శ్రీను, నాయకులు పన్నాల లింగయ్య, కారింగు రామ్మూర్తి, నేర్లకంటి రవికుమార్, సుజావుద్దీన్, కన్నెబోయిన నాగరాజు, ఇరిగి వెంకటేశం, గండు వెంకట్ గౌడ్, రమాదేవి, పంగ రామకృష్ణ, బొల్ల జనార్ధన్, సత్యం, సర్వేశ చారి తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ

## మణికొండలో రూ.100 కోట్ల బుల్కాపూర్ నాలా పనులు

### - పనులను వేగవంతంగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, అక్టోంబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.100 కోట్ల భారీ నిధులతో కొనసాగుతున్న బుల్కాపూర్ నాలా అభివృద్ధి, నిర్మాణ పనులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నాలా అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టడంతో పాటు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్, సహాయ ఇంజనీర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి:

### - జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
### - దేవలమ్మ నాగారం సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్

చౌటుప్పల్: అక్టోబర్ 8 వార్తా వేదిక సూర్య



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని దేవలమ్మ నాగారం సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజలకు చట్టాలు, న్యాయపరమైన సలహాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ గంధం నాగరాజు హాజరై మాట్లాడారు. గ్రామ ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు బాల్యవివాహాలపై, బాల కార్మికుల నిర్మూలనపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాల వాడకంతో జరిగే అనర్థాలు, ప్రజల ప్రాథమిక హక్కులు, బాధ్యతలతో పాటు చట్టాలపై సెక్షన్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, దోనూరి కిరణ్ రెడ్డి, ఫాతిమా, మహిళలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ అరెస్టులు నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా

చౌటుప్పల్: అక్టోబర్ 8 వార్తా వేదిక సూర్య



కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షులు బోయే దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఓటు చోరీకి పాల్పడుతున్నారంటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)పై ఆరోపణలు చేస్తూ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మరియు ఇండియా కూటమి నేతలు చేపడుతున్న నిరసనలకు మద్దతుగా ఈ ధర్నా నిర్వహించారు.

నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేతల అరెస్టులు, లాఠీచార్జీలను నిరసిస్తూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్,పిఎసిఎస్ వైస్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా కార్యదర్శి చింతల సాయిలు, మాజీ అధ్యక్షులు బక్క శ్రీనాథ్, సుర్వి నరసింహ గౌడ్, రిక్కల మహేందర్ రెడ్డి, పాక చిరంజీవి, బద్రి గాలయ్య, పస్తం గంగరాములు, మీసాల నరసింహ, పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం సత్తయ్య,బొబ్బిలి రాజేందర్,దుబ్బాక ఆకాష్ రెడ్డి, బండమీది ఎల్లయ్య, కొరవని లింగస్వామి, వీరముల సత్తయ్య, బుడిగే బాలకృష్ణ, మాదాని గోపాల్ ,వర్కాల వెంకటేష్, వెంకట్ కుమార్, రవికాంత్ రెడ్డి, కరెంటు శంకర్ నాయక్, జక్కడి వెంకట్ రెడ్డి, చెక్క మల్లయ్య, మేకల దేవేందర్ రెడ్డి, లందగిరి యాదయ్య, బుడుగు వెంకటేశం, పోలోజు శ్రీనివాస్ చారి, నరసింహ మాదాని ఎల్లప్ప, ఎండి ఎజాస్ పాషా, పాశం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి : ఎస్సై నర్సిరెడ్డి

చౌటుప్పల్ అక్టోబర్ 8 వార్తా వేదిక సూర్య



చౌటుప్పల్ మండలంలోని జై కేసీఆర్ గ్రామ పరిధిలోని ఎస్సార్ లాబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ జై కేసారం యాజమాన్యం శుక్రవారం ప్రాథమిక పాఠశాల జై కేసారం విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ,డిక్షనరీలు,కాపీ రైటింగ్ బుక్స్, నోట్ బుక్స్, కలరింగ్ బుక్స్,డైరీలు మరియు చెస్ బోర్డ్స్,వాలీబాల్,రింగ్ బాల్, క్రికెట్ కిట్ మొదలగు ఆట వస్తువులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి చౌటుప్పల్ ఎస్సై నర్సిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత పదవులు చేపట్టాలని అన్నారు. చదువుతోపాటు ఆటలు కూడా ఆడాలని సూచించారు. ఎస్సై రాంబాబు మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి మీ ముందు అతిథిగా వచ్చానని మీరు కూడా బాగా చదివి మీరు చదివిన పాఠశాలకు ముఖ్యఅతిథిగా వెళ్లేలా కృషి చేయాలని కోరారు. ఎస్సార్ లాబరేటరీస్ యాజమాన్యం దిలీప్ కృష్ణ , మౌనిక మాట్లాడుతూ తమ కంపెనీ నుంచి గత 14 సంవత్సరాలుగా ఇద్దరు విద్యా వాలంటీర్లను నియమించి వేతనం అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా పాఠశాలకు అవసరమైన స్టేషనరీని కూడా అందిస్తున్నామని తెలిపారు.కావున గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధికి కూడా తమ వంతు సహాయాన్ని అందిస్తున్నందుకు ఎస్సార్ ల్యాబ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.శ్రీనివాస్ ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఏ.కే.రమాదేవి ,బి. సునంద , జి.వెంకటేశం మరియు ఉప సర్పంచ్ బోదాసు స్వాతి వెంకటేష్, వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY





# మహబూబ్‌నగర్



## ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలి

**నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య ):**
ఓటు హక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమానికి ప్రజాస్వామ్యవాదులు అండగా నిలవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు జి.మోహన్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అన్నారు. బాలగోపాల్ 17 వ వర్ధంతి సందర్భంగా గురువారం నల్లగొండలోని అమరవీరుల స్థూపం వద్ద ఆయనకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలగోపాల్ అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని, అన్యాయాన్ని ప్రశ్నించారని గుర్తుచేశారు. ఢిల్లీలో ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ పారదర్శకత కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిపై ఆంక్షలు, నిర్బంధం వంటి చర్యలను ఆపాలని కోరారు. ఓటర్ల జాబితాపై వచ్చే ఆరోపణలను నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్, పీడీఎస్‌యూ, తెలంగాణ విద్యావంతుల వేదిక, బహుజన కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రియాంక గాంధీ అరెస్టుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరసన

**గట్టుప్పల్.అక్టోబర్ 8.వార్త వేదిక సూర్య:**



రాహుల్ ప్రియాంక గాంధీ అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విరమల్ల శ్రీశేలం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు .కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విరమల్ల శ్రీశేలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం ఓటు చోరీకి పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ నిరసన చేపడుతున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాందిపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సంఘం అక్రమలకు పాల్పడుతుందని కేంద్రం ఎన్నికల సంఘం అధికారిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు నామని జగన్నాధం,బిమానపల్లి రామయ్య కాంగ్రెస్ నాయకులు కంచుకట్ల సంపత్, చందా వెంకటేశం,బిమగని మల్లేశం,ఇడం గణేష్, దోర్నాల ఆంజయ్య,మాధగని శేఖర్ వెంకటేష్,విరమల్ల మల్లేశం,నామని వెంకటేశం,కమ్మం లక్ష్మయ్య,పగిల్లా యాదయ్య,రావుల పర్వతాలు,కర్నాటి గణేష్, చేరుపల్లి వెంకటేశం,పెదగని నరేందర్, పున్న శివ,దుబ్బాక సుధాకర్ పాల్గొన్నారు

## కస్తాలలో బోర్ వేయించిన మునుగోడు ఎమ్మెల్యే

**చందూరు, అక్టోబరు 8 (వార్త వేదిక సూర్య):**



ఎండకాలం మొదలుకాక ముందే తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలనే ముందు చూపుతో మునుగోడు శాసన సభ్యుడు కోమ టిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చందూరు మండలం కస్తాల గ్రామంలో గురువారం నూతనంగా తాగునీటి బోరును ఏర్పాటు చేయించారు. గ్రామంలోని కొన్ని వార్డుల్లో కొద్ది రోజులుగా నీటి సరఫరా సరిగా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సొంత నిధులతో వెంటనే బోరు బావి తవ్వించాలని ఆదేశించారు. దీంతో గురువారం గ్రామ పరిధిలో బోరు వేయించి, నీటి వసతిని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. బోరు వేయించడంతో కస్తాల గ్రామస్తుల నీటి తిప్పలు తప్పుతాయని, సమస్యను తెలపగానే పరిష్కరించిన ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి, నాయకులు కట్ట భిక్షం, అశోక్‌లతో పాటు గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్కినేనిగూడెంలో 'కపాస్ కాంతి'పై రైతులకు అవగాహన

**చందూరు , అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**
అధిక సాంద్రత పత్తి సాగుతో తక్కువ సమయంలో మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏవో)గా. మల్లేష్ తెలిపారు. స్థానిక చందూరు మూడవ వార్డు లక్కినేనిగూడెంలో గురువారం 'కపాస్ కాంతి' పథకంలో భాగంగా రైతులకు అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ఎన్. మహేష్‌తో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మల్లేష్ మాట్లాడుతూ... పత్తిని దగ్గర దగ్గరగా, అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకోవడం వల్ల పంట అంతా ఒకేసారి చేతికి వస్తుందన్నారు. దీనివల్ల కాలపరిమితి తగ్గి, అదే పొలంలో తదుపరి మరో పంట వేసుకునే వెసులుబాటు కలుగుతుందని వివరించారు. ఈ విధానంలో ఎకరానికి దాదాపు 40 వేల మొక్కల వరకు నాటుకోవచ్చని, ఇది సాధారణ సాగు కంటే మూడు రెట్లు ఎక్కువని పేర్కొన్నారు. దీనివల్ల ఒకే విడతలో అధిక దిగుబడి సాధించవచ్చని స్పష్టం చేశారు.ప్రస్తుతం పత్తి పంట ఆకు తెగులు, ఒత్తిడికి గురవుతున్నందున రైతులు 2 శాతం యూరియా లేదా మల్టీకే వంటి పోషకాలను పిచికారీ చేసుకోవాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పాశం వెంకట్ రెడ్డి, సంజీవ రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి.. దాసరి.గోవర్ధన్ యాదవ్

### లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన.. సర్పంచ్ దాసరి.గోవర్ధన్ యాదవ్

**మునుగోడు. అక్టోబర్8.. వార్త వేదిక సూర్య:.**
ప్రభుత్వ పథకాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బీరెల్లిగూడెం సర్పంచ్ దాసరి.గోవర్ధన్ యాదవ్ అన్నారు గురువారం మండల పరిధిలోని బీరెల్లిగూడెం గ్రామపంచాయతీ ఆవరణంలో లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేరుగా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిరంతరం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఆయన అహర్నిశలు కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దోటి.వెంకటేశ్వర్లు. పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి.వెంకన్న. రేషన్ డీలర్ సత్యనారాయణ. గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ. వార్డు సభ్యులు. దాసరి మహారాజ్. వేంపల్ల కవిత శేఖర్. దాసరి రమ్య రాంబాబు. మహిళా సంఘం అధ్యక్షురాలు దాసరి ఊర్మిళ. దాసరి రాములు. ధోటి.శీను. బూడిద లింగస్వామి. వేంపల్ల రాజమౌళి. శంకర్‌తదితరులు పాల్గొన్నారు

## ఎంవీఎస్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మేయర్ గుమ్మల మమత



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**
మహబూబ్‌నగర్ నగరంలోని ఎంవీఎస్ కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్ సరిత తిరుపతయ్య, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ సురేందర్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు. మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. దీంతో కళాశాల ప్రాంగణం బతుకమ్మ పాటలు, కోలాటాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నగర ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు ముకుందం రమేష్, శివజోగి, అనుప శేఖర్, అవేజ్, ఎన్‌పీ నేహాశ్రీ, కృష్ణకాంత్‌రెడ్డి, సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో క్రీడా టోర్నమెంట్ ప్రారంభం



### క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**
యువత క్రీడల్లో రాణించడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. షాద్‌నగర్ మినీ స్టేడియంలో స్థానిక క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు.

ఫ్యూచర్ సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతోందని, భవిష్యత్‌లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. యువ క్రీడాకారులు ఇప్పటి నుంచే తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

టోర్నమెంట్ విజేతకు రూ.70 వేల నగదు, రన్నరప్‌కు రూ.30 వేల నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడా క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల ఐక్యతే మన బలం..

### కార్మికుల కృషితోనే ప్రజాపాలన విజయవంతం: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**
ఆర్టీసీ కార్మికుల ఐక్యత, అంకితభావం ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్‌లోని కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రజాపాలనలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో, ఈ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తూ తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తున్న కార్మికులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రకటించిన అనంతరం, ఆ బాధ్యతను స్వీకరించి విజయవంతంగా అమలు చేయడంలో ఆర్టీసీ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజాపాలన ముందుకు సాగడంలో కార్మికుల ఐక్యత, కృషి ముఖ్యమని పేర్కొన్నారు.

సమ్మేళనానికి తెలంగాణ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు తరలిరావడం వారి ఐక్యతకు నిదర్శనమని మిథున్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అశ్వత్థామరెడ్డి, గద్దర్, బొంతు రామ్మోహన్, రాజయ్య, కోదండరాం తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కార్మికుల నుంచి లభిస్తున్న మద్దతును చూస్తే అశ్వత్థామరెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని మిథున్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తాతో పాటు పలువురు నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్,నక్కలగండి రిజర్వాయర్ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన

### జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్, నక్కలగండి రిజర్వాయర్ పనులను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మన్నెవారిపల్లి సమీపంలోని ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం నక్కలగండి రిజర్వాయర్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రాజెక్టు నిర్మాణ పురోగతి, ముంపు ప్రాంతాలు, భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, పరిహారం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నక్కలగండి రిజర్వాయర్ ముంపు పరిధిలోని మర్లపాడు తండా, కేశతాండలోని రీ–లోకేటెడ్ (=ఆ=) స్థలాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ పరిశీలించారు. పునరావాస ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ముంపునకు గురవుతున్న మర్లపాడు తండా గ్రామస్తులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పునరావాసం, పరిహారం, భూములు, మౌలిక వసతులు తదితర అంశాలపై గ్రామస్తులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ నక్కలగండి రిజర్వాయర్ ముంపు ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న కుటుంబాల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు.

అదేవిధంగా ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్, నక్కలగండి రిజర్వాయర్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనులు ముందుకు సాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత రైతాంగానికి, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు సంపూర్ణ మద్దతు

### బహుజన స్టూడెంట్ ఫెడరేషన్

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**



నాగర్ కర్నూల్ జిల్లా బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ మాట్లాడుతూ అక్టోబర్ 9 శుక్రవారం నాడు మాన్యవర్ కాన్షిరామ్ గారి 20వ వర్ధంతి సందర్భంగా హాలో బహుజన చలో బడంగ్ పెట్

బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించే సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్ లోని బడంగ్ పేట్ లో నిర్వహించే బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు నలుమూలల నుంచి విచ్చేయుచున్న బహుజన సైనికులకు ఆహ్వానం పలుకుతూ ఈ సభకు ఎంతోమంది కవులు, కళాకారులు, మేధావులు,వివిధ హోదాల్లో పనిచేస్తున్న ప్రజా సంఘాల నాయకులు,నిరుద్యోగులు, హాజరవుతున్నారు. కాబట్టి ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై ప్రతి నియోజకవర్గం నుంచి నుంచి పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా మందుల..బీరప్ప

**మునుగోడు. అక్టోబర్8. వార్త వేధిక సూర్య:**
మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందుల.బీరప్ప గురువారం కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మందుల.బీరప్ప మాట్లాడుతూ మునుగోడు మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.. గ్రామాల్లో కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన తాను అండగా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి.రాజగోపాల్ రెడ్డి. డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం.శ్రీనివాస్ రెడ్డి. డిసిసి అధ్యక్షుడు పున్నం కైలాస నేత. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి.సైదులు కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

## మున్ననూరులో పాడి పశువులకు వైద్య పరీక్షలు..

### గర్భకోశ వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన..

### 38 పశువులకు చికిత్స..

**మిడ్జిల్, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**



పాడి పశువుల్లో గర్భకోశ సంబంధిత వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారించడంతో పాటు పశు పోషకులకు అవగాహన కల్పించేందుకు మున్ననూరు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్య పశుసంవర్ధక శాఖ, తెలంగాణ రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

శిబిరంలో మొత్తం 38 పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు. అదేవిధంగా 15 దూడలకు నట్టల నివారణ మందులను అందించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, గర్భకోశ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సకాలంలో వైద్య పరీక్షల ప్రాధాన్యతపై పాడి రైతులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్, గ్రామ సర్పంచ్ సుజాత మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్ శ్రావణి, ఉపసర్పంచ్ రాణిబాయి, గ్రామ పెద్దలు నర్సిరెడ్డి, మల్లయ్య గౌడ్, రామస్వామి, ప్రహ్లాద్ రెడ్డి, యాదయ్య, పశువైద్య సిబ్బంది సత్యం, జేవీవో దామోదర్, వీఎల్వో సత్యం, ఓఎస్, గోపాలమిత్రలు యాదగిరి, నరసింహ, వేణుగోపాల్, రామకృష్ణతో పాటు పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్ర ప్రతిభకు పురస్కారాలు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (వార్తా వేదిక సూర్య):**



బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎం.ఆర్.వి. ప్రసాద్–ఎం.ఏ. భవాని మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.1,000 చొప్పున నగదు బహుమతులు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి రూ.3,000తో పాటు గోల్డ్ మెడల్ అందజేశారు.

ముఖ్య అతిథి లీలా మోహన్‌రావు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య మాట్లాడుతూ ఇలాంటి పురస్కారాలు విద్యార్థుల్లో పోటీతత్వం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిద్దాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

### సిద్దాపూర్ గ్రామ శివారులో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థల పరిశీలన,

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని సిద్దాపూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రాతో కలిసి పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ సకాలంలో భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయంపై అధికారులు ఆరా తీశారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, భోజన ఏర్పాట్లు, పాఠశాలలో అమలవుతున్న నిర్వహణ విధానాల గురించి సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండటం వారి ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో ముఖ్యమని ఈ తనిఖీ ప్రాధాన్యతను తెలియజేసింది. పాఠశాలకు కొంతమంది విద్యార్థులు తరచుగా గైర్హాజరవుతున్నట్లు గుర్తించిన అధికారులు, అందుకు గల కారణాలను సంబంధిత ఉపాధ్యాయులతో పాటు తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలను గుర్తించడం ద్వారా వారి చదువుకు ఆటంకం కలగకుండా చూడాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువులో రాణించేలా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాల్సిన ప్రాధాన్యతను గుర్తించారు.

## అక్రమ అరెస్టులు చేస్తే చూస్తూ ఊరుకోము

### బీఆర్ఎస్ నాయకులు హెచ్చరిక

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 08 ( వార్త వేదిక సూర్య ) :**



నాగర్ కర్నూల్ జిల్లాలో అక్రమ అరెస్టులకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని భిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ భిఆర్ఎస్ మాజీ జెడ్పిటిసి శ్రీశైలం ను అరెస్టు చేయడం సిగ్గుచేటని ఉద్దేశపూర్వకంగానే మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అధికారం ఉందని అహంకారంతో తనకు అడ్డుగా మాట్లాడుతున్న వారిపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నాగయ్య, రైతుబంధు మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ తిమ్మాజిపేట పాండు,గంగాధర్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 141
శుక్రవారం
09 అక్టోబర్ 2026



# యూరప్‌లో స్టార్ల వెకేషన్.. ఎన్టీఆర్, ఆలియా సందడి

సినీ తారలు వరుస షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉన్నా.. కాస్త విరామం దొరికితే కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి విదేశీ వెకేషన్‌కు వెళ్లడం సర్వసాధారణం. ప్రస్తుతం టాలీవుడ్ యంగ్‌టైగర్ జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ కూడా తమ బిజీ షెడ్యూల్‌కు చిన్న విరామం ఇచ్చి యూరప్‌లో సందడి చేస్తున్నట్లు సమాచారం. ఆలియా స్పెయిన్‌లో స్నేహితురాళ్లతో గడుపుతుండగా.. ఎన్టీఆర్ భార్య లక్ష్మీ ప్రణతితో కలిసి ఇటలీలో హాలిడేను ఆస్వాదిస్తున్నారు.

**స్పెయిన్‌లో ఆలియా సందడి**

ఆలియా భట్ ప్రస్తుతం స్పెయిన్‌లోని అందమైన మల్లోర్కా దీవిలో స్నేహితురాళ్లతో కలిసి సమయాన్ని గడుపుతున్నట్లు తెలుస్తోంది. అక్కడి సముద్ర తీరాలు, ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలను ఆస్వాదిస్తూ వెకేషన్ జ్ఞాపకాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటోంది. ఈ సందర్భంగా ఆలియా తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ ఫొటోను కూడా మార్చింది. ఎరుపు రంగు గౌను ధరించి సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తున్న ఫొటోను డీపీగా పెట్టుకోవడంతో అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

**భార్యతో కలిసి ఇటలీలో తారక్**

మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ తన భార్య లక్ష్మీ ప్రణతితో కలిసి ఇటలీలో హాలిడేను ఆస్వాదిస్తున్నట్లు సమాచారం. సన్నిహిత స్నేహితులతో కలిసి యూరప్ పర్యటనకు వెళ్లిన ఈ దంపతులకు సంబంధించిన కొన్ని క్యూట్, క్యాండిడ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వరుస షూటింగ్స్, ప్రమోషన్స్‌తో బిజీగా ఉండే తారక్.. దొరికిన ఈ విరామాన్ని భార్యతో కలిసి ప్రశాంతంగా గడుపుతున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ కుటుంబంతో కలిసి విదేశాల్లో రిలాక్స్ అవుతుండటం నందమూరి అభిమానులను ఆకట్టుకుంటోంది.

**వెకేషన్‌కు మహేష్ బాబు?**

ఇదిలా ఉంటే.. సూపర్‌స్టార్ మహేష్ బాబు కూడా త్వరలో కుటుంబంతో కలిసి విదేశీ వెకేషన్‌కు వెళ్లనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 'వారణాసి' చిత్రీకరణలో బిజీగా ఉన్న మహేష్.. ఈ వారంలో షూటింగ్ పూర్తి చేసుకుని కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.




# టీవీలోకి 'ధురంధర్: ది రివెంజ్'.. ఎప్పుడంటే?

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన భారీ యాక్షన్ చిత్రం 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకుంది. థియేటర్లలో భారీ వసూళ్లు సాధించిన ఈ చిత్రం ఇప్పుడు బుల్లితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. థియేటర్లలో సినిమాను మిస్ అయిన ప్రేక్షకులతో పాటు మరోసారి చూడాలనుకునే అభిమానులను అలరించేందుకు టెలివిజన్ ప్రీమియర్‌కు సిద్ధమైంది.

**అక్టోబరు 18న టీవీ ప్రీమియర్**

'ధురంధర్: ది రివెంజ్' టెలివిజన్ ప్రీమియర్ తేదీ, సమయం ఖరారైనట్లు సమాచారం. అక్టోబరు 18, ఆదివారం సాయంత్రం 7 గంటలకు స్టార్ గోల్డ్ ఛానల్‌లో ఈ సినిమా ప్రసారం కానుంది. ఆదివారం ప్రైమ్ టైమ్‌లో సినిమా ప్రసారం కానుండటంతో బుల్లితెరపై కూడా భారీ స్పందన లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

**రణ్‌వీర్ యాక్షన్‌కు ప్రశంసలు**

థియేటర్లలో విడుదలైన సమయంలో 'ధురంధర్: ది రివెంజ్'కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభించింది. యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన కథనం, రణ్‌వీర్ సింగ్ నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో రణ్‌వీర్ ప్రధాన పాత్రలో నటించగా.. అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్, సారా అర్జున్, రాకేశ్ బేడీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

**టీఆర్పీపై ఆసక్తి**

భారీ విజయాన్ని అందుకున్న సినిమాలు టెలివిజన్‌లో ప్రసారమైనప్పుడు వాటి టీఆర్పీలపై ఆసక్తి నెలకొంటుంది. ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదించుకున్న 'ధురంధర్: ది రివెంజ్'కు బుల్లితెరపై ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం ప్రైమ్ టైమ్‌లో ప్రసారం కానుండటంతో పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు సినిమాను వీక్షించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# 'ది ప్యారడైజ్' ఓటీటీ ఎప్పుడు?.. స్పెషల్ ఎట్రాక్షన్ ఇదే




నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. సెప్టెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనను అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.180 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదలపై ఆసక్తి నెలకొంది.

**భాషలతో సంబంధం లేకుండా..**

తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల్లోనూ, విదేశీ మార్కెట్లలోనూ 'ది ప్యారడైజ్'కు మంచి వసూళ్లు వస్తున్నట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో థియేటర్లు ప్రేక్షకులతో సందడిగా కనిపిస్తున్నాయి. నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటించగా.. 'శికంజా మాలిక్' అనే కరడుగట్టిన ప్రతినాయకుడి మోహన్‌బాబు కనిపించారు. రాఘవ్ జుయేల్, సంపూర్ణేష్ బాబు, ప్రియదర్శి, సోనాలి కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషించారు.

**నవంబరులో ఓటీటీకి?**

థియేటర్లలో సినిమాను చూడటం మిస్సయిన ప్రేక్షకులు ఓటీటీ విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ది ప్యారడైజ్' డిజిటల్ హక్కులను ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఒప్పందం ప్రకారం డిజిటల్ వెర్షన్ మరింత ప్రత్యేకంగా మారనుంది. థియేటర్లలో మంచి స్పందన దక్కించుకున్న ఈ సినిమా ఓటీటీలో ఎలాంటి ఆదరణ పొందుతుందనేది ఆసక్తికరంగా మారింది.



# దశరథుడిగా అరుణ్ గోవిల్.. 'రామాయణం'లో మరో విశేషం

బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో అయోధ్య రాజు దశరథుడిగా నటిస్తున్న సీనియర్ నటుడు అరుణ్ గోవిల్ పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. దశాబ్దాల క్రితం రాముడిగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆయన.. ఇప్పుడు అదే రామాయణ కథలో దశరథుడిగా కనిపించనుండటం విశేషంగా మారింది.

**రాముడి నుంచి దశరథుడిగా..**

రామానంద్ సాగర్ తెరకెక్కించిన ప్రముఖ టీవీ సీరియల్ 'రామాయణ్'లో రాముడి పాత్రలో నటించిన అరుణ్ గోవిల్ దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఒక తరం ప్రేక్షకులకు రాముడిగా పరిచయమైన ఆయన.. ఇప్పుడు అదే కథలో అయోధ్య రాజు దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో 68 ఏళ్ల అరుణ్ గోవిల్ రాజసంగా సింహాసనంపై కూర్చున్నట్లు కనిపించారు.

**భారీ తారాగణంతో 'రామాయణం'**

ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. దశరథ మహారాజుగా అరుణ్ గోవిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. భారీ బడ్జెట్, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అరుణ్ గోవిల్ పాత్రకు సంబంధించిన తాజా పోస్టర్‌తో ఈ అంచనాలు మరింత పెరిగాయి.

**రెండు భాగాలుగా విడుదల**

'రామాయణం'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగం 2026 నవంబరు 6న దీపావళి కానుకగా విడుదల కానుండగా.. రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయనున్నారు. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాటు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు అందించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# 'క్రేజీ కల్యాణం' రిలీజ్ డేట్ మారింది.. ఎప్పుడంటే?




టాలెంటెడ్ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త తెలుగు చిత్రం 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పూర్తిస్థాయి కుటుంబ వినోద చిత్ర విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. తొలుత అక్టోబరు 30న విడుదల చేయాలని భావించిన మేకర్స్.. తాజాగా రెండు వారాల ముందుగానే అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు ప్రకటించారు.

**అనుపమ పోస్ట్‌తో అధికారిక ప్రకటన**

విడుదల తేదీ మారిన విషయాన్ని అనుపమ పరమేశ్వరన్ సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకుంది. 'క్రేజీ కల్యాణం ముహూర్తం ఫిక్స్.. అక్టోబర్ 16న మీ అభిమాన థియేటర్లలో కలుద్దాం' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో సినిమా విడుదల తేదీపై స్పష్టత వచ్చింది.

**టీజర్‌లో తండ్రి--కూతుళ్ల సందడి**

ఇటీవల విడుదలైన 'క్రేజీ కల్యాణం' టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఇందులో అనుపమ 'కీర్తి' అనే స్వతంత్ర భావాలు కలిగిన యువతి పాత్రలో కనిపించనుంది. ఆమె తండ్రిగా సీనియర్ నటుడు నరేశ్ నటించారు. కూతురి పెళ్లిని ఘనంగా జరిపించాలని తండ్రి తాపత్రయపడుతుండగా.. తన జీవితాన్ని తనకు నచ్చినట్లుగా జీవించాలని కీర్తి భావిస్తుంది. ఈ ఇద్దరి ఆలోచనల మధ్య చోటుచేసుకునే హాస్యభరిత సన్నివేశాలు టీజర్‌లో ఆకట్టుకున్నాయి.

**కుటుంబ ప్రేక్షకుల కోసం..**

ఈ చిత్రంలో అనుపమతో పాటు అఖిల్ రాజ్ ఉద్దేమారి, నరేశ్, దర్శకుడు–నటుడు తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బద్రప్ప గజుల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతూ కథను కూడా అందించారు. సురేష్ బొబ్బిలి సంగీతం, శ్యామ్ దుపాటి ఛాయాగ్రహణం, శ్రవణ్ కటికనేని ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కామెడీ, కుటుంబ భావోద్వేగాలతో రూపొందుతున్న ఈ చిత్రం అక్టోబరు 16న థియేటర్లలోకి రానుంది.

# ట్రోలింగ్‌పై రష్మిక ఘాటు సమాధానం

టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్‌గా గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వీరిద్దరూ కలిసి నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' అక్టోబరు 16న దసరా కానుకగా థియేటర్లలోకి రానుంది. దీంతో చిత్రబృందం ప్రమోషన్లను ముమ్మరం చేసింది. వరుస ఇంటర్వ్యూలు, కార్యక్రమాలతో సినిమాపై అంచనాలు పెంచుతోంది.

**ట్రోలింగ్‌పై రష్మిక స్పందన**

సినిమా ప్రమోషన్ల కంటే విజయ్, రష్మికల వ్యక్తిగత అనుబంధానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా చర్చకు వస్తున్నాయి. మరోవైపు ప్రమోషన్ కార్యక్రమాల్లో రష్మిక ఎంతో ఉత్సాహంగా, సరదాగా కనిపించడంపై కొందరు నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. ఆమెను 'ఓవరాక్షన్', 'క్రింజ్' అంటూ ట్రోల్ చేస్తున్నారు.

తాజా ఇంటర్వ్యూలో ఇదే విషయంపై రష్మికకు ప్రశ్న ఎదురైంది. దీనిపై ఆమె ఎలాంటి మొహమాటం లేకుండా స్పందించింది. తాను ఎక్కడ ఉన్నా అక్కడి వాతావరణాన్ని సంతోషంగా ఉంచాలని కోరుకుంటానని చెప్పింది. చుట్టూ ఉన్నవారితో సరదాగా మాట్లాడటం, నవ్వుతూ ఉండటం తన సహజ స్వభావమని పేర్కొంది. కొందరు తన వ్యక్తిత్వాన్ని విమర్శించినా వాటిని పెద్దగా పట్టించుకోనని స్పష్టం చేసింది.

**సహజత్వాన్ని వదులుకోనన్న నటి**

అందరినీ మెప్పించడం సాధ్యం కాదని, ఇతరుల అభిప్రాయాల



కోసం తన అసలైన వ్యక్తిత్వాన్ని మార్చుకోవాల్సిన అవసరం లేదని రష్మిక తెలిపింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు తనలోని ఉత్సాహాన్ని ఇష్టపడతారని, అందుకే విమర్శల కోసం తన సహజత్వాన్ని వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది.

**భారీ అంచనాలతో 'రణబాలి'**

'రణబాలి' పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. కథ, పాత్రలు, భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ అంశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చిత్రబృందం చెబుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటపై ఉన్న క్రేజ్ కూడా సినిమాకు అదనపు బలంగా మారింది. మరి భారీ అంచనాల మధ్య అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్న 'రణబాలి' ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

# మాధురి రాథోడ్ మళ్లీ జోరు.. కొత్త ఫోక్ సాంగ్‌తో కమ్‌బ్యాక్

'నిమ్మ తోట వనములో', 'సీటీ చీర', 'బాసింగ బలాలే' వంటి జానపద పాటలతో తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్న మాధురి రాథోడ్ మరోసారి వార్తల్లో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన ఆమె మోడల్‌గా, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తగా, ముఖ్యంగా జానపద నృత్యకారిణిగా మంచి పేరు సంపాదించుకుంది. తాజాగా 'బిందెలు బిందెలు బావయ్యో' అనే కొత్త జానపద పాటతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

**కొత్త పాటతో సందడి**

'బిందెలు బిందెలు బావయ్యో' పాటకు సంబంధించిన ప్రచార దృశ్యాలను తాజాగా విడుదల చేశారు. ఎప్పటిలాగే మాధురి రాథోడ్ తనదైన మాస్ ఎనర్జీతో స్టెప్పులు వేసి ఆకట్టుకుంది. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. యూట్యూబ్‌తో పాటు ఇతర వేదికల్లోనూ ఈ పాటకు మంచి స్పందన లభిస్తోంది. త్వరలోనే పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

**వివాదాల తర్వాత కమ్‌బ్యాక్**



ఇటీవల మాధురి రాథోడ్, ఆమెతో కలిసి పనిచేసిన నృత్యకారుడు ఈశ్వర్ సాయి వ్యక్తిగత వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనల నేపథ్యంలో ఇద్దరి కెరీర్ దెబ్బతింటుందని పలువురు భావించారు. అయితే ఈశ్వర్ సాయి కూడా ఇటీవల తన కొత్త పాటకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించి, వృత్తిపరంగా మళ్లీ బిజీ అవుతాననే ధీమా వ్యక్తం చేశాడు. తాజాగా మాధురి కూడా కొత్త పాటతో ప్రేక్షకుల ముందుకు రావడంతో ఇద్దరూ తమ కళారంగ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**మిలియన్ల వ్యూస్ సాధించిన జోడీ**

ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ జోడీకి జానపద పాటల్లో మంచి క్రేజ్ ఉంది. వీరిద్దరూ కలిసి నటించిన 'రాతిరి రాతిరి రాతిరిలో', 'సీటీ చీర', 'సన్న సన్న బియ్యమే', 'ప్రమీల ప్రమీల', 'కళ్లకు కాటుక దిద్దినారో', 'అది అబ్బబ్బాగా పోరి', 'లాయి లాయి లబ్బరు బొమ్మ', 'బాసింగా బలాలే' వంటి పాటలు యూట్యూబ్‌లో భారీగా వీక్షణలు సాధించాయి. దీంతో కొత్తగా వచ్చిన 'బిందెలు బిందెలు బావయ్యో' పాటపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and Printed at **SURYA DIGITAL PRINTERS,** H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State -508252. Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:-TGTEL/25/A0305, Cell:9985389183. EmailId:vaarthavedhikasurya2025@gmail.com